RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:189 | శుక్రవారం | 07 ఆగస్టు 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

PRESS

77309 83966 98491 98098



## ఢిల్లీ చుట్టూ రేవంత్ ప్రదక్షిణలు

- 32 నెలల్లో 75 సార్లు ఢిల్లీకి
- ఢిల్లీకి సామంతులుగా కాదు స్వతంత్రులుగా వుండాలి
- కేసీఆర్ చేతిలో తెలంగాణను పెట్టడమే జయశంకర్ సార్‌కు అసలైన నివాళి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3



## 20 నెలల్లో 150 జీసీసీలు.. 1.5 లక్షల ఉద్యోగాలు

- జేఎల్ఎల్ జీసీసీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఆగస్టు 6 :**

రాష్ట్రంలో గత 20 నెలల కాలంలో కొత్తగా ఏర్పాటైన 150 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ద్వారా 1.5 లక్షల మందికి ఉపాధి లభించిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మిగతా 2వ పేజీలో..

# అధికారులపై సీఎం ప్రత్యేక నిఘా..?





- అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ నివేదికలపై దృష్టి
- శాఖల వారీగా సమీక్షలకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం
- ఉన్నతాధికారుల బాధ్యతలపైనా చర్యలు ఉండొచ్చన్న చర్చ
- సచివాలయంలో ఆసక్తికర చర్చలకు దారితీసిన పరిణామాలు

**హైదరాబాద్, ఆగస్టు 6:**

తెలంగాణ ప్రభుత్వంలోని కీలక శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇటీవల పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు అవినీతి నిరోధక శాఖ దర్యాప్తులో చిక్కడం, వారి వద్ద భారీ ఆస్తులు వెలుగుచూడడం వంటి పరిణామాల నేపథ్యంలో వివిధ శాఖల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విజిలెన్స్ నివేదికలను సీఎం పరిశీలిస్తున్నట్లు సమాచారం. వివిధ ప్రభుత్వ శాఖల్లో టెండర్లు, పనుల కేటాయింపులు, కొనుగోళ్లు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంశాలపై విజిలెన్స్ విభాగం సమగ్ర నివేదికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఏ శాఖలో ఎలాంటి నిబంధనల ఉల్లంఘనలు జరిగాయి, ఎక్కడ అవినీతి ఆరోపణలు ఉన్నాయి అనే వివరాలను శాఖల వారీగా సమీక్షించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్న చర్చ సాగుతోంది. చిన్న స్థాయి అధికారులకే పరిమితం కాకుండా నిర్ణయాలు తీసుకున్న ఉన్నతాధికారుల బాధ్యతలను కూడా పరిశీలించే అవకాశముందని సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నివేదికల్లో తేలిన అంశాల ఆధారంగా అవసరమైతే క్రమశిక్షణ చర్యలు, బదిలీలు లేదా మరింత లోతైన విచారణకు ప్రభుత్వం మొగ్గు చూపవచ్చని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

మిగతా 2వ పేజీలో..

## ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ

2

- 1.05 కోట్ల ల్యామినేటెడ్ కార్డులను అందజేయనున్న ప్రభుత్వం
- సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం.. 119 నియోజకవర్గాల్లో ఒకేసారి పంపిణీ
- పర్యవేక్షణ బాధ్యతలు ఆర్డీవోలకు అప్పగింత




## గోదావరి ప్రాజెక్టులకు సమాధి



- ఏపి డైరెక్షన్‌లో నడుస్తున్న జీఆర్ఎంబీ
- తెలంగాణకు జై అనని రేవంత్ సీఎంగా ఉన్నారు
- మాజీ మంత్రి హరీష్ రావు
- జయశంకర్‌కు నివాళులు

**సిద్దిపేట, ఆగస్ట్ 6 :**

తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని, జై తెలంగాణ అని ఏరోజూ అనని వ్యక్తి ఈరోజు సీఎంగా ఉన్నారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేదని హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ పోరాటం,

## లీగల్ నోటీసులకు భయపడను

- హరీశ్ రావు క్షుద్ర పూజలపై వివరణ ఇవ్వాలని డిమాండ్
- సీఎంతో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం
- సమన్వయ కమిటీలో బహిరంగంగానే చర్చలు జరిగాయని వ్యాఖ్య
- ఆధారాలు ఉంటే ఆడియోలు, వీడియోలు బయటపెట్టాలని సవాల్



**హైదరాబాద్, ఆగస్టు 6:**


బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పంపిన లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యల్లో ఎలాంటి అసత్యం లేదని, అవసరమైతే న్యాయస్థానంలోనే అన్ని విషయాలకు సమాధానం ఇస్తానని అన్నారు. హరీశ్ రావు క్షుద్ర పూజలకు సంబంధించిన ఆరోపణలపై ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని మరోసారి డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, హరీశ్ రావును వ్యక్తిగతంగా కించపరచలేదని, తప్పుడు ప్రచారం కూడా చేయలేదని చెప్పారు. ఆయన సందర్శించిన ఆలయాలు క్షుద్ర పూజలకు ప్రసిద్ధి చెందినవని ప్రచారం ఉన్న నేపథ్యంలో, ఆ ఆలయాలకు ఎందుకు వెళ్లారో స్వయంగా

మిగతా 2వ పేజీలో..

## నకిలీ ఎన్‌వోసిలపై కొనసాగుతున్న విచారణ

- మరో 48 కాలేజీల చిట్టాను అందచేసిన హైడ్రా
- కాలేజీలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం

2




## ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో ఉదయ్ కృష్ణారెడ్డి

- ప్రశ్నిస్తున్న పోలీసులు
- నేటితో ముగియనున్న పోలీస్ కస్టడీ



**హైదరాబాద్, ఆగస్ట్ 6:**

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదున్నర గంటల వరకు కస్టడీ కొనసాగనుంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీసీపీ .. అత్తాపూర్ పీఎస్‌కు

మిగతా 3వ పేజీలో..



## సింగరేణికి నైనీ నల్ల బంగారం

- తెలంగాణ ఇంధన భద్రతలో చారిత్రక ఘట్టం
- ఒడిశా నుంచి జైత్రయాత్రగా రాష్ట్రానికి వచ్చిన నల్ల బంగారం
- 1,131 కి.మీ ప్రయాణించి సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరిన తొలి రేక్
- అమెరికా నుంచి శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి

**మంచిర్యాల, ఆగస్టు 6 :**

రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చే దిశగా సింగరేణి చరిత్రలో అత్యంత అద్భుతమైన, చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఏళ్లతరబడి కాగితాలకే పరిమితమైన ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్.. ప్రజా ప్రభుత్వం రాకతో, పాలకుల చిత్తశుద్ధితో ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా, ఒడిశా రాష్ట్రంలోని సింగరేణి నైనీ బొగ్గు గని నుంచి లోడ్ చేసిన తొలి బొగ్గు రైల్వే □రేక్ సుమారు 1,131 కి.మీ ప్రయాణం పూర్తి చేసి గురువారం ఉదయం మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్టీపీపీ)కి చేరుకుంది. ఇతర రాష్ట్రంలోని సింగరేణి గని నుంచి రాష్ట్రానికి బొగ్గు సరఫరా కావడం సంస్థ చరిత్రలో ఇదే తొలిసారి కావడంతో ఎస్టీపీపీలో పండగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఇంధన భద్రతలో ఇది ఒక సువర్ణాధ్యాయం.

**నేడు సాకారమైన స్వప్నం**

కేంద్ర బొగ్గు శాఖ 2015లో సింగరేణికి నైనీ బొగ్గు బ్లాక్‌ను

మిగతా 2వ పేజీలో..

## సింగరేణి గనుల్లోకి అత్యాధునిక సాంకేతికత

- కొత్త బ్లాకుల అభివృద్ధి, గనుల్లో భద్రతే లక్ష్యంగా కసరత్తు
- కేటర్‌పిల్లర్, కొమాట్సు సందర్శించిన డిప్యూటీ సీఎం, సింగరేణి అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 6 :**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సింగరేణి, జిమ్కో (జేఎంఎంకో లిమిటెడ్) సీనియర్ అధికారులతో కూడిన ఉన్నతస్థాయి బృందం అమెరికాలో పర్యటిస్తోంది. ఈ బృందం టెక్సాస్, అరిజోనా రాష్ట్రాల్లో ఉన్న ప్రఖ్యాత మైనింగ్ యంత్రాల తయారీ కేంద్రాలను గురువారం సందర్శించింది. అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సింగరేణికి తీసుకురావడం, తద్వారా గనుల్లో భద్రతను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఈ పర్యటనకు శ్రీకారం చుట్టాయి. ముందుగా అరిజోనా రాష్ట్రం టక్సన్‌లోని కేటర్‌పిల్లర్ డెమాన్‌స్ట్రేషన్ అండ్ లెర్నింగ్ సెంటర్‌ను ఉప ముఖ్యమంత్రి బృందం

మిగతా 2వ పేజీలో..



# గోదావరి ప్రాజెక్టులకు సమాధి

**మొదటిపేజీ తరువాయి**

జయశంకర్ సార్ ఆరాటం వల్లే అని చెప్పారు. గోదావరిలో 380 టిఎంసిల నీళ్లు కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించామని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా నీళ్ల కోసమే వచ్చిందని గుర్తు చేసిన హరీష్ రావు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ప్రాజెక్టులకు సంబంధించి ఒక్క అనుమతి కూడా తీసుకురాలేకపోయిందని దుయ్యబట్టారు. గతంలో 18 సార్లు జీఆర్ఎంబీ సమావేశాలు జరిగినప్పుడు ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించినా ఆనాడు తెలంగాణ ప్రభుత్వం వాటిని తిప్పికొట్టి అన్ని అనుమతులు సాధించిందన్నారు. కానీ నేడు చరిత్రలో తొలిసారిగా గతంలో అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి రివ్యూ చేయాలనే అంశాన్ని జీఆర్ఎంబీ అజెండాలో చేర్చడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీళ్లపై కనీస సోయి లేదని, ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్చించాలని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందని ప్రశ్నించారు. సమ్మక్క సారక్క ప్రాజెక్ట్‌కు హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చాక ప్రభుత్వం ఎందుకు వదులుకుంటుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. శాఖ స్టేజ్ 2కు సమ్మక్క సారక్క నీళ్లు అవసరమన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మించే విషయంలో ఏపీ సర్కార్‌తో తెలంగాణ సర్కార్ లోపాయికారి ఒప్పందం చేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ ఏపీ ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. ప్రభుత్వం కోర్టులలో వేసిన పిటిషన్ల నిర్వహణ రాక అట్టర్ ఫ్లాప్ అయిందని, కనీసం రిట్ పిటిషన్ వేయడం కూడా ఈ ప్రభుత్వానికి రావడం లేదని ఎద్దేవా చేశారు.

# లీగల్ నోటీసులకు భయపడను: మహేష్ కుమార్ గౌడ్

**మొదటిపేజీ తరువాయి**

వెల్లడించాలని కోరారు. రాష్ట్రానికి ఎవరు మేలు చేశారో, ఎవరు నష్టం కలిగించారో ప్రజలే ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశంపై వస్తున్న ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. ప్రభుత్వ పథకాల అమలుపై సభ్యులందరూ స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వెల్లడించారని, ప్రతి అంశాన్ని ముఖ్యమంత్రి కమిటీ ముందు వివరించాల్సిన అవసరం లేదని అన్నారు. పార్టీ, ప్రభుత్వం ఒకే దిశగా పనిచేస్తున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు పూర్తి సఖ్యత ఉందని స్పష్టం చేశారు. తనకు, ముఖ్యమంత్రికి మధ్య విభేదాలున్నాయనే ప్రచారాన్ని మహేష్ కుమార్ గౌడ్ కొట్టిపారేశారు. తాము తరచూ ఫోన్‌లో మాట్లాడుకుంటామని, పార్టీకి సంబంధించిన అంశాలను ముఖాముఖిగానే చర్చించుకుంటామని తెలిపారు. తనపై ఆడియోలు, వీడియోలు ఉన్నాయని ప్రచారం చేస్తున్నవారు నిజంగా ఆధారాలు ఉంటే వాటిని బయటపెట్టాలని సవాల్ విసిరారు. బీజేపీ నేతల విమర్శలపైనా ఆయన స్పందించారు. వ్యక్తిగత విమర్శలతో రాజకీయాలు చేయడం సరికాదని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రాధాన్యమని అన్నారు. నాయకత్వాన్ని వ్యక్తిగత అంశాలతో కాకుండా పనితీరుతో అంచనా వేయాలని వ్యాఖ్యానించారు.

# ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ


**హైదరాబాద్, ఆగస్టు 6:**

తెలంగాణలో కొత్త ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్ కార్డుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. అర్హులైన కుటుంబాలకు ఆహార భద్రతను మరింత విస్తరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త ల్యామినేటెడ్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ చేపట్టనున్నారు.

ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేయనున్నారు.

పంపిణీ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి నియోజకవర్గంలో పర్యవేక్షణ బాధ్యతలను ఆర్డీవోలకు అప్పగించారు. పంపిణీ కేంద్రాల వద్ద తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. కార్యక్రమం పూర్తయిన అనంతరం నియోజకవర్గాల వారీగా పంపిణీ వివరాలతో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.




# నకిలీ ఎన్‌వోసిలపై కొనసాగుతున్న విచారణ

**హైదరాబాద్, ఆగస్ట్ 6:**

ఇంటర్ కాలేజీల నకిలీ ఫైర్ ఎన్ఓసీల వ్యవహారంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరో 48 కాలేజీల చిట్టాను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేశారు. విచారణలో భాగంగా ఒకే తరహాలో నకిలీ ఎన్ఓసీలు తయారు చేసినట్లు గుర్తించారు. దాదాపు 56 కాలేజీలు నకిలీ ఎన్ఓసీలు సమర్పించినట్లు గుర్తించిన హైడ్రా.. మరో 176 కాలేజీలపై విచారణ జరుపుతోంది. ఐదు అంతస్తులలోపు ఉన్న భవనాల అనుమతుల కోసం ఫైర ఎన్ఓసీలను హైడ్రా ఇస్తుంది. ఆఫ్‌లైన్‌లో ఎన్ఓసీలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్ఓసీల కోసం హైడ్రాకు దరఖాస్తు చేయకుండానే నకిలీలు సృష్టించి ఇంటర్ బోర్డుకు కాలేజీలు సమర్పించినట్లు విచారణలో వెల్లడైంది. ఒక్కొక్క యూనివర్సిటీకి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలను కాలేజీ యాజమాన్యాలు ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. ఎన్‌వోసీల కోసం జీహెచ్ఎంసీ, హైడ్రా, ఫైర్ మాజీ డీజీల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఆయా కళాశాలల యాజమాన్యాలను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. హైడ్రా నివేదిక, పోలీసుల విచారణలో బయటపడ్డ అంశాలను ఆధారంగా చేసుకుని కాలేజీ యజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# సింగరేణికి 'నైనీ' నల్ల బంగారం

**మొదటిపేజీ తరువాయి**

కేటాయించింది. అయితే అధికారంలో ఉన్న తొమ్మిదేళ్ళు గత బీఆరఎస్ ప్రభుత్వం ఈ బ్లాక్‌ను గాలికి వదిలేసింది. దీంతో అనుమతులు రాక ప్రాజెక్టు పడకేసింది. కానీ, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను తొలగించుకుంటూ చేస్తూ రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కూడా అయిన భట్టి విక్రమార్క అలుపెరగని కృషి చేశారు. స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లారు. 2024 జులైలో తొలిసారిగా ఒడిశా వెళ్లి అక్కడి ప్రభుత్వంతో, అధికారులతో జరిపిన చర్చలు సత్ఫలితాలు ఇచ్చాయి. అడ్డంకులన్నీ తొలగిపోవడంతో 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని డిప్యూటీ సీఎం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఆరుగాలం శ్రమించిన ఫలితంగా నేడు నైనీ నుంచి తొలి బొగ్గు రేక్ తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. నైనీ బొగ్గు గని నుంచి తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు తరలింపు ఒక చారిత్రక అవసరం. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో కీలకమైన ఈ థర్మల్ కేంద్రానికి నాణ్యమైన బొగ్గును అందించేందుకు తొలి రైలు రేక్ ఏకంగా 1,131 కి.మీ ప్రయాణించింది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా నాలుగు వేల టన్నుల అత్యుత్తమ జీ10 గ్రేడ్ బొగ్గు సింగరేణికి చేరుకుని రాష్ట్ర ఇంధన రంగానికి కొత్త కళను తీసుకొచ్చింది.

**నైనీ గని ప్రత్యేకతలు ఇవే**

ఈ గని రాష్ట్ర విద్యుత్ రంగానికి రాబోయే దశాబ్దాలపాటు వెన్నెముకగా నిలవనుంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఇది మరో కలికితురాయిగా మిగిలిపోనుంది. 2015 ఆగస్టు 13న కేంద్ర ప్రభుత్వం సింగరేణి కేటాయించింది. 340.78 మిలియన్ టన్నులు వార్షిక బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం. ఏడాదికి కోటి టన్నులు (10 మిలియన్ టన్నులు). గని జీవితకాలం 36 సంవత్సరాలు. బొగ్గు నాణ్యత అత్యుత్తమ జీ10 గ్రేడ్.



**తొలి రైల్వే రేక్‌కు సింగరేణి అధికారుల ఘన స్వాగతం**

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి చేరుకున్న తొలి నైనీ బొగ్గు రైల్వే రేక్‌కు సంస్థ డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (ఈడిఎం) ఎం.తిరుమలరావు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం కోల్ యార్డులో బొగ్గు అన్‌లోడింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ, తిరుమలరావులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ విద్యుత్ అవసరాలకు పెద్దపీట వేస్తూ నైనీ గని నుంచి బొగ్గు సరఫరా ప్రారంభించామని చెప్పారు. ఇప్పటివరకు సింగరేణి ఇతర రాష్ట్రాలకు బొగ్గు సరఫరా చేసిందని, అయితే ఇప్పుడు ఇతర రాష్ట్రంలోని తన గని నుంచి స్వరాష్ట్రానికి బొగ్గు తరలించడం సంస్థ చరిత్రలో అరుదైన ఘట్టమని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో ఇటీవల తాడిచెర్ల 2, మణుగూరు డిప్‌సైడ్ బ్లాకులు సంస్థకు లభించాయని, త్వరలో మరికొన్ని గనులను కూడా సింగరేణికి సాధించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి సంస్థ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.చిరంజీవి, జనరల్ మేనేజర్ నర్సింహారావు, గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు వీరభద్ర, ప్రాతినిధ్య కార్మిక సంఘం నాయకుడు, కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్ జనప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి గౌడ్, ఇతర అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

**సింగరేణి మైనింగ్ ఇక విశ్వవ్యాప్తం**

**– అమెరికా నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో సందేశం**

నైనీ బొగ్గు రాక సందర్భంగా ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అక్కడినుంచే సింగరేణి యాజమాన్యానికి, కార్మికులకు వీడియో సందేశం ద్వారా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. 'సింగరేణికి ఇది ఒక చరిత్రాత్మక సందర్భం. రాష్ట్ర అవసరాలు తీర్చడమే కాక దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా సింగరేణి బొగ్గును సరఫరా చేస్తోంది. పెరుగుతున్న రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే మనం తాడిచర్ల 2 బ్లాక్‌ను పొందాం. ఇటీవల వేలంలో మణుగూరు బ్లాక్‌ను దక్కించుకున్నాం. భవిష్యత్తులో మరిన్ని బ్లాకులను పొందటానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. రాబోయే వందేళ్లలో సింగరేణి కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ తవ్వకాల్లోకి కూడా అడుగుపెట్టాలి. ప్రపంచంలోనే అత్యుత్తమ మైనింగ్ సంస్థలతో పోటీపడే స్థాయికి సింగరేణి ఎదగాలి. అందుకోసం ప్రపంచంలో ఎక్కడ అందుబాటులో ఉన్న అత్యాధునిక మైనింగ్ యంత్రాలనైనా తెచ్చేందుకు సిద్ధం. ఇందులో భాగంగానే క్యాటర్‌పిల్లర్ కంపెనీకి చెందిన ఆధునిక మైనింగ్ పరికరాలను పరిశీలిస్తున్నాం. భవిష్యత్ తరాలకు ఉజ్వలమైన భవిష్యత్తును అందించే ఈ నూతన ప్రక్రియ మొదలైన నేటి రోజు ఒక చరిత్రాత్మక దినంగా నిలిచిపోతుంది' అన్నారు. ఒడిశా నుంచి తెలంగాణకు తొలి బొగ్గు రవాణా విజయవంతం కావడంలో సహకరించిన తెలంగాణ ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వం, భారతీయ రైల్వేలు, సంబంధిత అధికారులు, ఉద్యోగులకు సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# 20 నెలల్లో 150 జీసీసీలు.. 1.5 లక్షల ఉద్యోగాలు

**మొదటిపేజీ తరువాయి**

వెల్లడించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్టులో జేఎల్ఎల్ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన ప్రాంతాలను గుర్తించి సిఫారసు చేసే సంస్థగా జేఎల్ఎల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాంటి సంస్థ హైదరాబాద్‌ను తన జీసీసీ కేంద్రంగా ఎంచుకోవడం మన రాష్ట్ర సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ ఐటీ కార్యకలాపాలు మార్పులకు లోనవుతున్న తరుణంలో ఇన్నోవేషన్ ఆధారిత జీసీసీలు భవిష్యత్తు ఉపాధికి ప్రధాన కేంద్రాలుగా అవతరిస్తున్నాయని చెప్పారు. కృత్రిమ మేధ(ఏఐ), ఆటోమేషన్ ప్రభావంతో సాంకేతిక రంగంలో మార్పులు వచ్చినా జీసీసీల ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జీసీసీల వేగవంతమైన విస్తరణకు అత్యుత్తమ మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పరిశ్రమలకు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ప్రధాన కారణాలన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఔటర్ రింగ్ రోడ్ ఎంత కీలక పాత్ర పోషించిందో ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్, ఏఐ సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు భవిష్యత్ పెట్టుబడులకు బలమైన పునాది వేస్తున్నాయని చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, ఏఐ, డీప్‌టెక్, అధునాతన సాంకేతిక రంగాలకు అవసరమైన మానవ వనరులను రాష్ట్రం సిద్ధం చేస్తోందన్నారు.



**హైదరాబాద్‌కు 16% జాతీయ వాటా**

2024 నుంచి 2026 మధ్య దేశవ్యాప్తంగా జీసీసీల కార్యాలయ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతంగా నమోదైందని మంత్రి తెలిపారు. అదే సమయంలో నగరంలో జరిగిన మొత్తం కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతానికి చేరుకోవడం హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థలో వాటికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఆరోగ్య సంరక్షణ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాలకు చెందిన జీసీసీల ఏర్పాటులోనూ హైదరాబాద్ తొలి ఎంపికగా నిలుస్తోందని చెప్పారు. దీంతో ఐటీ కేంద్రంగా మాత్రమే కాక అత్యాధునిక సాంకేతిక రంగాల్లోనూ ప్రపంచస్థాయి ఆవిష్కరణలకు వేదికగా నగరం ఎదుగుతోందన్నారు.

**1,600 మందికి ఉద్యోగాలు**

జేఎలఎల్ ఏర్పాటు చేసిన గ్లోబల్ □కేపబిలిటీ సెంటర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే వచ్చే రెండేళ్లలో సుమారు 1,600 మందికి ఉపాధి లభించనుంది. ఫైనాన్స్, మానవ వనరులు, ప్రాజెక్టు నిర్వహణ, లీజ్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, టెక్నాలజీ ఆధారిత సేవలను ప్రపంచవ్యాప్తంగా జేఎలఎల్ కార్యకలాపాలకు ఈ కేంద్రం సేవలను అందిస్తుంది. కార్యక్రమంలో జేఎల్ఎల్ ఇండియా సీఈవో రాధా ధిర్, హైదరాబాద్ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పట్నాయక్, గ్లోబల్ సర్వీస్ సెంటర్ హెడ్ ధీరజ్ పోప్లీ, ఐటీ శాఖ సలహాదారు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులపై ప్రత్యేక నిఘా..?

**మొదటిపేజీ తరువాయి**

ఇటీవల నిర్వహించిన ఒక శాఖ సమీక్షలో ప్రతిపాదిత పనుల వ్యయంపై అధికారులు ఇచ్చిన వివరాలను సీఎం ప్రశ్నించినట్లు సమాచారం. గతంలో జరిగిన వ్యయాలు, కాంట్రాక్టుల వివరాలపై తన వద్ద సమాచారం ఉందని పేర్కొనడంతో సమావేశంలో పాల్గొన్న అధికారులు ఆశ్చర్యానికి గురైనట్లు ప్రచారం జరుగుతోంది.

మరో శాఖ సమీక్షలో కూడా సంబంధిత ప్రతిపాదనలపై పూర్తి వివరాలు ముందుంచి అధికారులను సీఎం వివరణ కోరినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో శాఖల పనితీరుపై ప్రభుత్వం మరింత లోతైన పర్యవేక్షణ చేపడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అయితే ఈ వ్యవహారానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ విజిలెన్స్ నివేదికల ఆధారంగా శాఖల పనితీరును సమీక్షించే ప్రక్రియ కొనసాగుతోందన్న ప్రచారం సచివాలయంలో విస్తృత చర్చకు దారితీస్తోంది. భవిష్యత్‌లో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# సింగరేణి గనుల్లోకి అత్యాధునిక సాంకేతికత

**మొదటిపేజీ తరువాయి**

సందర్శించింది. అక్కడ స్వయంచాలిత(అటానమస్), రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేసే భారీ మైనింగ్ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా వీక్షించింది. ఓసీల్లో ఉపయోగించే భారీ యంత్రాల విడిభాగాలు, ఆపరేటర్ల శిక్షణ విధానాలు, భద్రతా వ్యవస్థల పనితీరు గురించి సాంకేతిక నిపుణులతో అధికారులు లోతైన చర్చలు జరిపారు. ముఖ్యంగా ప్రమాదకరమైన ప్రాంతాల్లో మనుషులు నేరుగా పనిచేసే విధానం తగ్గించేందుకు ఉపయోగపడే 'టెలిరిమోట్ ఆపరేషన్ టెక్నాలజీ'పై ప్రతినిధి బృందం ప్రత్యేక దృష్టి సారించింది. అనంతరం టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ సమీపంలోని లాంగ్‌వ్యూలో ఉన్న కొమాట్సు మైనింగ్ కార్పొరేషన్ ఫెసిలిటీని కూడా బృందం సందర్శించింది. అక్కడ భారీ మైనింగ్ యంత్రాల తయారీ, అసెంబ్లింగ్ ప్రక్రియలను పరిశీలించింది. సింగరేణిలో యంత్రాల నిర్వహణ ఖర్చులు, డౌన్ టైమ్ తగ్గించడమే లక్ష్యంగా భవిష్యత్తులో సాంకేతిక సహకారం, విడిభాగాల లభ్యత, పరికరాల సరఫరా ఒప్పందాల తదితర అంశాలపై సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆధునిక, స్వయంచాలిత యంత్రాలను వాడటం ద్వారా ఓపెన్‌కాస్ట్ గనుల్లో కార్మికుల భద్రతను గణనీయంగా పెంచడంతోపాటు ప్రమాదాల రేటును భారీగా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.



**భవిష్యత్తులో సర్వీస్ యూనిట్లు ఏర్పాటయ్యే అవకాశం**

ప్రపంచస్థాయి తయారీదారులతో నేరుగా చర్చలు జరపడం వల్ల యంత్రాల కొనుగోలులో మెరుగైన నిబంధనలు, వేగవంతమైన సర్వీసు, స్థానికంగా నిర్వహణ కేంద్రాల ఏర్పాటుకు అవకాశాలు మెరుగుపడతాయి. సాంకేతిక బదిలీ ఒప్పందాల ద్వారా భవిష్యత్తులో తెలంగాణలోనే సర్వీస్ యూనిట్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీనిద్వారా సింగరేణి సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ లభించడంతోపాటు సంస్థ నిర్దేశించుకున్న దీర్ఘకాలిక కోల్‌టుక్లీన్‌ఎనర్జీ పరివర్తన లక్ష్యాలతో అనుసంధానం అయ్యేలా ఈ పర్యటన దోహదపడుతుంది. సింగరేణి సంస్థ ఇటీవల కొత్తగా రెండు భారీ బొగ్గు బ్లాకులను దక్కించుకున్న నేపథ్యంలో అమెరికా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. తాడిచెర్ల ఓసీ2 బ్లాక్ నామినేషన్ పద్ధతిలో సింగరేణికి కేటాయించగా మణుగూరు పరిధిలోని 'పీకేఓసీ2 డిప్‌సైడ్' బ్లాక్‌ను వేలం ద్వారా దక్కించుకుంది. తాడిచెర్ల బ్లాక్‌లో సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు, 4050 ఏళ్ల జీవిత కాలం ఉండగా పీకేఓసీ2 బ్లాక్‌లో 180 మిలియన్ టన్నుల నిల్వలు, 25 ఏళ్ల జీవిత కాలం ఉంది. సింగరేణి నిర్దేశించుకున్న వార్షిక వంద మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి ఈ బ్లాకులు కీలకం కానున్నాయి. ఫలితంగా రాబోయే రోజుల్లో ఈ భారీ ఓసీ ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున షావెల్స్, డంపర్లు, డ్రాగ్ లైన్లు, డ్రిల్లింగ్ సిస్టమ్స్ వంటి భారీ యంత్రాల అవసరం ఏర్పడనుంది. కేటర్‌పిల్లర్, కొమాట్సు వంటి అంతర్జాతీయ సంస్థల టెక్నాలజీని ముందుగానే అంచనా వేయడం ద్వారా కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కావడానికి ముందే యంత్రాల కొనుగోలు, ఫ్లీట్ విస్తరణ, ఆటోమేషన్ ప్రణాళికలను సింగరేణి సిద్ధం చేసుకోగలుగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కార్యక్రమంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్, క్యాటర్‌పిల్లర్ ఇండియా ప్రతినిధి ఆర్‌కే మిశ్రా, డెన్నిస్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ చుట్టూ రేవంత్ ప్రదక్షిణలు

**హైదరాబాద్, ఆగస్టు 6:**

తెలంగాణ ఆత్మగౌరవాన్నిఢిల్లీ ముందు తాకట్టు పెట్టే రాజకీయాలు రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేయడంపై తీవ్ర విమర్శలు చేశారు. 32 నెలల్లో 75 సార్లు ఢిల్లీ వెళ్లారని, దాదాపు ప్రతి 13 రోజులకు ఒకసారి తిరుగుతున్నారని అన్నారు. ఢిల్లీకి సామంతులు కాకుండా స్వతంత్రులు కావాలి అని జయశంకర్ సార్ చెప్పేవారని గుర్తు చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని చెప్పేవారని పేర్కొన్నారు. నీటి హక్కుల విషయంలో ఏపీ ప్రభుత్వం తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను రద్దు చేయాలని ప్రయత్నిస్తోందని, జీఆర్ఎంబీ ద్వారా జరుగుతున్న అన్యాయాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు ఇప్పటికే ఆధారాలతో వివరించారని చెప్పారు. ఢిల్లీ పార్టీల చేతుల్లో తెలంగాణ మళ్లీ తల్లడిల్లుతోందని, తెలంగాణ కోసం పుట్టిన నిఖార్సయిన పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ఒక బీజేపీ ఎంపీ తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్‌తో పోల్చినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎవరూ స్పందించలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ, అప్పులు, అభివృద్ధి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు పుష్కలంగా ఉన్నా ప్రభుత్వం వాటిని వినియోగించలేకపోతోందన్నారు. కాంగ్రెస్ తెలంగాణకు శాశ్వత శత్రువని జయశంకర్ సార్ చెప్పేవారని గుర్తు చేస్తూ తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

**జయశంకర్ సార్ ఆశయ సాధనే అసలైన నివాళి**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె.జయశంకర్ సార్ ఆశయాల సాధనే ఆయనకు అందించే నిజమైన నివాళి అని కేటీఆర్ అన్నారు. జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండలిలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పాల్గొన్నారు. జయశంకర్ సార్‌తో పదేళ్ల పాటు కలిసి పనిచేసే అదృష్టం తనకు దక్కిందని కేటీఆర్ తెలిపారు. ఆయన ఒక ఎన్‌సైక్లోపీడియా, గొప్ప ఉపాధ్యాయుడని కొనియాడారు. కేసీఆర్‌ను తెలంగాణ జాతిపితగా భావించిన జయశంకర్ సార్, ఆయనకు గాడ్ ఫాదర్‌లా మార్గనిర్దేశం చేశారని చెప్పారు. స్వయం సమృద్ధి, ఆత్మగౌరవం, స్వయం పాలన అనే మూడు దశల ద్వారా తెలంగాణ సమాజాన్ని జయశంకర్ సార్ విశ్లేషించారని, పాలమూరు వెనుకబాటుతనాన్ని కూడా అదే కోణంలో వివరించారని అన్నారు. 2006, 2008 ఉప ఎన్నికల సమయంలో ఉద్యమానికి భావజాల వ్యాప్తి, ఆందోళన, డెమోక్రటైజేషన్ అనే మూడు పార్శ్వాలు ఉన్నాయని జయశంకర్ సార్ చెప్పారని గుర్తు చేశారు. యాచించి కాదు.. శాసించి తెలంగాణ సాధించాలి అనే ఆలోచనను కేసీఆర్‌లో నూరిపోసిన వ్యక్తి ఆయనేనన్నారు. ఉద్యమం భాస్వరంలా మండుతుంది.. తెలంగాణ తప్పక వస్తుంది అని జయశంకర్ సార్ తమకు ధైర్యం చెప్పారని, శ్రీకాంతాచారి వంటి అమరవీరుల త్యాగాలతో ఉద్యమం విజయవంతమైందన్నారు. ఢిల్లీలో జాతీయ మీడియాకు తెలంగాణ చరిత్రను, హైదరాబాద్ రాష్ట్ర ప్రత్యేకతను, ఫజల్ అలీ కమిషన్ సిఫార్సులను, ఆంధ్ర-తెలంగాణ విలీనానికి గల కారణాలను జయశంకర్ సార్ ఆధారాలతో వివరించేవారని తెలిపారు. తెలంగాణ ప్రజలను చిన్నబుచ్చే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించేవారని కేటీఆర్ అన్నారు. జయశంకర్ ఆశయ సాధన కోసం బీఆర్ఎస్ నిరంతరం పని చేస్తుందని, తెలంగాణను మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.

---

## గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తాం

- **రైతులు సహకరించాలి: మంత్రి పొన్నం**

**సిద్దిపేట ఆగస్టు 6:**

గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు సాగునీరందించడం తన బాధ్యత అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రాజెక్టు కాలువల భూసేకరణ కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.250 కోట్లు విడుదల చేసిందని, రైతులు భూసే కరణకు సహకరిస్తే పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన న్యాయప రమైన చిక్కులు తొలగిపోయాయని, కుడి, ఎడమ కాలువల తో పాటు డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో గురువారం పాల్గొన్న మంత్రి పొన్నం ముందుగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా కోహెడ మార్కెట్ కమిటీలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం మార్కెట్ కమిటీలో రూ.1.61 కోట్లతో నిర్మించనున్న ఓపెన్ షెడ్, ప్లాట్ఫారం, మీటింగ్ హాల్ పనులకు శంకుస్థాపన చేశారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కోహెడ మండలం ధర్మసాగర్పల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన జీపీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని పేర్కొన్నారు. కోహెడ తంగళ్లపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, భూగర్భ జలాల సంరక్షణ కోసం బోర్వెల్ రీఛార్జ్ పాయింట్ల సంఖ్యను పెంచాలని సూచించారు.

---

## ఎఫ్‌టీఈల సమస్యల పరిష్కారానికి సానుకూలం

- **పే స్కేల్ అంశంపై సీఎం, డిప్యూటీ సీఎంతో చర్చిస్తా**
- **గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**



**హైదరాబాద్, ఆగస్టు 6 :**

జీ రామ్ జీ చట్టం ద్వారా రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపినప్పటికీ ఫిక్స్‌డ్ టెన్యూర్ ఉద్యోగుల(ఎఫ్‌టీఈ) దశాబ్దకాల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. హైదరాబాద్ బి.ఆర్.కే.ఆర్ భవన్‌లో ఉపాధి హామీ ఎఫ్‌టీఈ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో మంత్రి సీతక్క గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పే స్కేల్ అమలు, కేడర్ స్ట్రెంగ్త్ ఖరారు, బదిలీల విధానం, ఇతర సర్వీస్ అంశాలను జేఏసీ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 2006లో డీఎస్సీ ద్వారా ఎంపికై దాదాపు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నప్పటికీ ఇప్పటికీ పే స్కేల్ అమలు కాలేదని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. ఇది కేవలం జీతాల సమస్య కాదని, తమ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. మొత్తం 3,800 మంది పనిచేస్తున్నామని, తమకు పేస్కేల్ అమలు చేస్తే నెలకు రూ.2.5 కోట్ల చొప్పున అదనపు భారం పడుతుందని తెలిపారు. రాబోయే నాలుగు నుంచి అయిదేళ్లల్లో పలువురు ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నందున ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం కూడా క్రమంగా తగ్గుతుందని వివరించారు. ఉద్యోగుల సమస్యలపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందిస్తూ పే స్కేల్ అంశాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిల దృష్టికి తీసుకెళ్లి చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే మరోసారి ఉద్యోగ సంఘాలతో సమావేశమై తదుపరి చర్యలపై చర్చిస్తామన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటికే పే స్కేల్ అమలుతో ప్రభుత్వంపై పడే ఆర్థిక భారాన్ని అంచనా వేసిందని, అది ఏడాదికి రూ.30 కోట్ల వరకు ఉంటుందని వివరించారు. ఉద్యోగులు తొందరపాటు చర్యలకు దిగొద్దని, ప్రభుత్వం సమస్య పరిష్కారానికి సానుకూలంగా ఉన్నందున ఆందోళన అవసరం లేదని మంత్రి సూచించారు. జపాన్ తరహాలో ఎక్కువ పని చేసి ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే మార్గాలు కూడా ఉన్నాయని, పని నిలిపివేయడం కంటే బాధ్యతాయుతమైన పద్ధతుల్లో సమస్యలను పరిష్కరించుకోవడం మంచిదని సూచించారు. ఎఫ్‌టీఈ ఉద్యోగులకు ప్రమాద బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నామని మంత్రి తెలిపారు.

**ఉపాధి హామీ ఉద్యోగుల జీతాలు**

కేంద్ర ప్రభుత్వ వాటా చెల్లించనందున మూడు నెలలుగా జీతాలు నిలిచిపోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుగా జీతాలు చెల్లించి అనంతరం కేంద్రం నుంచి ఆ మొత్తాన్ని రీయింబర్స్ చేసుకునే ప్రతిపాదన చేసినప్పటికీ కేంద్రం అంగీకరించలేదని మంత్రి తెలిపారు. ఈ కారణంగానే జీతాలలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని, సమావేశం జరుగుతుండగానే సీఎం కార్యాలయాన్ని సంప్రదించి ఈ అంశంపై ఆయనతో చర్చించేందుకు సమయం కోరినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. వీలైనంత త్వరగా పే స్కేల్ అమలుకు కృషి చేస్తామని హామీ ఇవ్వగా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని కోరిన కూలీలందరికీ పని కల్పించేందుకు అదనపు సమయాన్ని వెచ్చించడానికి కూడా సిద్ధమని అన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, ఎఫ్‌టిఈ జేఏసీ సభ్యులు ఎలబద్రి లింగయ్య, ఎ.అంజిరెడ్డి, ఎం.విజయ్ కుమార్, ఈ. వెంకట్రామిరెడ్డి, ఎం.మోహన్ రావు, ఇతర నేతలు పాల్గొన్నారు.

**జయశంకర్ జయంతి వేడుకలు**

బీఆర్‌కే భవన్‌లోని 'సెర్ప్' కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు జరిగాయి. మంత్రి సీతక్క జయశంకర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో 'సెర్ప్' సీఈవో దివ్యా దేవరాజన్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

---

# సామాజిక న్యాయం కోసం నా జీవితం అంకితం

- **జీవితాలను మార్చే సామాజిక న్యాయ సంకల్ప సభ**
- **అగ్రకులాల్లోని ప్రజాస్వామ్య వాదులే మార్పులకు కారణం**
- **బీసీలకు 50శాతం రిజర్వేషన్ వచ్చేవరకు పోరాడుతా**
- **టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, ఆగస్టు 6:**

ఒకనాటి అమానవీయ పరిస్థితులను మార్చుకునేందుకే మనం రాజ్యాంగం రాసుకున్నాం. కానీ రాజ్యాంగం పూర్తి స్థాయిలో మనం అమలు చేసుకోలేకపోయాం. అందుకే మనం ఈ సభ ద్వారా సామాజిక న్యాయ పోరాటం చేయబోతున్నాం. సామాజిక న్యాయ సంకల్పం తీసుకోబోతున్నామని టీఆర్ ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో మాట్లాడుతూ సామాజిక న్యాయం అనగానే అగ్రవర్ణాలు మా సీట్లు ఎక్కడ పోతాయోనని భయపడుతారు. ఇవ్వాళ మనం టీఆర్ఎస్ అనే పార్టీ పెట్టుకున్నాం. మనకు సామాజిక న్యాయంపై పోరాటం చేసే ఒక గొప్ప అవకాశం దొరికింది. సమాజంలోని అగ్రవర్ణాల్లో ఉన్న గొప్ప నాయకులే ఒక్కొక్కరుగా వెలుగుతూ మనం ప్రజాస్వామ్యాన్ని సాధించుకునే పరిస్థితి తెచ్చారు. నేను బీసీల గురించి మాట్లాడితే చాలా మంది అగ్రవర్ణాల్లో పుట్టిన నీకెందుకు అంటూ పళ్లు ఇకిలిస్తారు. కానీ నా పుట్టుక నా చేతిలో లేదు. కానీ నేను ఎవరి కోసం పనిచేయాలో అది నా చేతిలోనే ఉంది. ఇప్పటి వరకు గ్రామపంచాయితీ మొఖం కూడా తెలియని కులాలతో పనిచేసి వారిలో సాధికారిత తెచ్చే వరకు కూడా నా జీవితాన్ని అంకితం చేస్తున్నా. ఈ దేశంలో ఇప్పటి వరకు వచ్చిన విప్లవాత్మక మార్పుల్లో చాలా వరకు కూడా అగ్రకులాల్లో ఉన్నప్రజాస్వామ్య వాదుల ప్రయత్నం ద్వారానే జరిగాయి. మండలి కమిషన్ రిపోర్ట్ ను కాంగ్రెస్ పార్టీ 20 ఏళ్లు బీరువాలో పెడితే విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ అనే క్షత్రియ పుత్రుడే దాన్ని అమలు చేశారు. తమిళనాడులో బీసీలకు రిజర్వేషన్ల కోసం వాటిని 9వ షెడ్యూల్ లో పెట్టించినది అగ్రకులానికి చెందిన జయలలితే. అలాంటి వారందరినీ మనం ఆదర్శంగా తీసుకొని ముందుకు కదలాలి. మనవాళ్లపై మనమే వివక్ష చూపటం అన్యాయం. ఇప్పటికైనా సామాజిక న్యాయం కోసం అందరం పోరాటం చేద్దాం. కలిసి రావాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. రిజర్వేషన్లు ఉన్నప్పటికీ కూడా 97 శాతం దళితులు అత్యంత వెనుకబాటులో ఉన్నారు. ఈ దేశంలో లక్షలాదిగా ఎస్సీ, ఎస్టీల బ్యాక్ లాగ్ పోస్టులు ఉన్నాయి. వాటి గురించి మనం పిడికిలి ఎత్తి పోరాటం చేయాలి. ఎస్టీల్లో కూడా 97 శాతం ప్రజలు అత్యంత వెనుకబడే ఉన్నారు. ఇక ముస్లింలలో కూడా కనీసం సర్పంచ్ పదవి చేపట్టని పరిస్థితి ఉంది. అన్ని ప్రభుత్వాలు వాళ్ల జీవితాల్లో మార్పులు తెస్తామంటూ మాటలు మాత్రమే చెబుతున్నాయి. కచ్చితంగా ముస్లింలకు కూడా వాళ్ల హక్కులతో కూడిన రిజర్వేషన్లు రావాలి. అన్ని వర్గాలకు సమన్యాయం కావాలని పోరాటం



చేయాలంటే దమ్ము, ధైర్యం ఉండాలి. అన్ని వర్గాలకు న్యాయం చేసేలా కచ్చితంగా నేను పోరాటం చేస్తాను. సగానికి పైగా మన దేశంలో బీసీ జనాభా ఉంది. కానీ 71 శాతం మంది బీసీలు ఎస్సీల కన్నా దారుణమైన పరిస్థితిలో ఉన్నారు. ఈ కాంగ్రెస్ పార్టీ బీసీ లు 46 శాతం ఉంటే 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతోంది. బీసీ ముస్లింల సంగతి పట్టించుకోవటం లేదు. బీసీలకు సామాజిక న్యాయం జరగాలంటే 50 శాతం రిజర్వేషన్లు ఉండాల్సిందే. అందుకోసం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి కలిసి పనిచేసి బీసీలకు న్యాయం చేయాలి. ప్రతి గ్రామంలో మనం సామాజిక న్యాయం కోసం సభలు నిర్వహించుకుందాం. ఆ తర్వాత అవసరమైతే చలో ఢిల్లీ కార్యక్రమం పెట్టుకుందాం. సామాజిక న్యాయం కోసం మనం చేసే పోరాటాన్ని వచ్చే ఏడాది ఆగస్ట్ 6 నాటికి సమీక్ష చేసుకుందాం. ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఒక మాట చెప్పారు. తెలంగాణ ఉద్యమంతోపాటు సామాజిక తెలంగాణ ఉద్యమాన్ని ఒకేసారి చేయలేమన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత సామాజిక న్యాయం కోసం అంతే పవిత్రంగా మనం ఉద్యమాన్ని చేయాలని చెప్పారు. ఆయన కన్న కలలను నిజం చేసే విధంగా మనం పోరాటం చేద్దాం. జయశంకర్ సార్ విగ్రహాన్ని మనం కచ్చితంగా ట్యాంక్ బండ్ వద్ద పెట్టుకోవాలి. ఈ సభ ద్వారా మనం కొన్ని తీర్మానాలు చేస్తున్నాం. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు కలిసి వచ్చే వారితో దేశవ్యాప్తంగా టీఆర్ఎస్ ఉద్యమిస్తుంది. మహాత్మా జ్యోతిరావ్ పూలే దంపతులకు భారత రత్న అవార్డు ఇవ్వాలి. ప్రొఫెసర్ జయశంకర్ సార్ కు పద్మవిభూషణ్ అవార్డు ఇవ్వాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలి. ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని పెట్టాలి. ఎస్సీ, ఎస్టీల నిధులను వాళ్ల అభ్యున్నతి కోసమే వాడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను నింపేందుకు ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలి. ఆదివాసీలకు అడవులపై సంపూర్ణ హక్కులు రావాలి. డీలిమిటేషన్ తో సంబంధం లేకుండా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. ముస్లింలకు ఆర్థిక స్వావలంబనతోపాటు వక్ఫ్ బోర్డు చట్టం తేవాలి. సిక్కులు, క్రిస్టియన్లకు ఆర్థిక స్వావలంబన ఉండేలా చర్యలు తీసుకోవాలి. ట్రాన్స్ జండర్లకు సంపూర్ణ హక్కులు రావాలి. వికలాంగులకు పెంచుతామన్న పెన్షన్లు పెంచాలి. వారికి కో ఆప్షన్ సభ్యుల్లో రిజర్వేషన్ కల్పించాలి.

---

## ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో
# ఉదయ్ కృష్ణారెడ్డి

**మొదటిపేజీ తరువాయి**

చేరుకున్నారు. కృష్ణారెడ్డిని డీసీపీ పర్యవేక్షణలో సీఐ జ్యోత్స్న విచారిస్తున్నారు. కస్టడీలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. విచారణలో కీలక ఆధారాలు సేకరించే దిశగా పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా మిస్సైన మొబైల్ ఫోన్‌పై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఉదయ్ కృష్ణారెడ్డి రెండో మొబైల్ పైన ఆరా తీస్తున్నారు. మిస్సైన రెండో మొబైల్ దొరికినట్లయితే మరికొన్ని కీలక అంశాలు బయట పడే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఉదయ్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను పోలీసులు సీజ్ చేసి ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిని గత నెల 28న పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ అధికారులు ఉప్పరపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా రెండు రోజులపాటు కస్టడీకి న్యాయస్థానం అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలోనే ఉదయ్ కృష్ణారెడ్డిని కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌తో పరిచయం, లైంగిక వేధింపులు, తదితర అంశాలపై పోలీసుల విచారణ కొనసాగనుంది.

---

## పదవుల భర్తీలో కాంగ్రెస్
# తీరు సరిగా లేదు

- **ఎమ్మెల్సీ కోదండరామ్ పెదవి విరుపు**

**హైదరాబాద్,ఆగస్ట్ 6:**



పదవుల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సరిగా లేదని ఎమ్మెల్సీ కోదండరాం పెదవి విరిచారు. పదవుల భర్తీ ఆలస్యం చేయడం వల్ల కలిగే ప్రయోజనం లేదన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయనకు గురువారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల అంశంలో బీఆర్ఎస్ హయాంలో కంటే ఈ ప్రభుత్వంలో స్పందన బాగుందని రేవంత్ రెడ్డి సర్కారును ప్రశంసించారు. ప్రభుత్వంలో తమ భాగస్వామ్యంపై సంప్రదింపులు చేస్తున్నామని వివరించారు. తమకు ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్లు ఇస్తామన్నారని గుర్తు చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చిస్తున్నామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఖరితో ఈ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత జయశంకర్ సర్ అని విద్యార్థులే ప్రకటించుకున్నారని ఎమ్మెల్సీ కోదండరాం వివరించారు.

---

## ధాన్యం అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలి: రామచందర్ రావు

- **రూ.500 కోట్ల విలువైన ధాన్యం అక్రమాలు జరిగాయని ఆరోపణ**
- **కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియపై పారదర్శక విచారణకు డిమాండ్**
- **దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచన**
- **కొనుగోలు వ్యవస్థలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని విజ్ఞప్తి**



**హైదరాబాద్, ఆగస్టు 6:**

రాష్ట్రంలో సుమారు రూ.500 కోట్ల విలువైన దాదాపు 90 వేల టన్నుల ధాన్యం అక్రమాలు జరిగాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై పారదర్శకంగా, వేగంగా దర్యాప్తు జరిపించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.

2023 నుంచి మిల్లర్లకు అప్పగించిన ధాన్యం, ప్రభుత్వానికి తిరిగి అందిన బియ్యం మధ్య గణనీయమైన వ్యత్యాసం ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. కస్టమ్ మిల్లింగ్ కోసం ఇచ్చిన ధాన్యం పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి చేరలేదన్న ఆరోపణలు వస్తున్నాయని, దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం జరిగి ఉండొచ్చని తెలిపారు.

ధాన్యం కొనుగోలు వ్యవస్థ రైతుల జీవనాధారానికి, ప్రజా పంపిణీ వ్యవస్థకు అత్యంత కీలకమని రామచందర్ రావు అన్నారు. ప్రభుత్వ ధాన్యం మళ్లింపు వంటి ఘటనలు ఆర్థిక నష్టంతో పాటు రైతుల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.

ఈ వ్యవహారంలో ఎవరైనా దోషులుగా తేలితే వారి హోదాతో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియల్లో పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేసే సమగ్ర వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు.

భవిష్యత్‌లో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, పారదర్శక విధానాలతో రైతులు, ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంపొందించాలని రామచందర్ రావు తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

---

## హైడ్రాలో 150 ఉద్యోగాల భర్తీ

**హైదరాబాద్, ఆగస్టు 6:**

హైదరాబాద్ విపత్తు నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న హైడ్రాలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. కాంట్రాక్టు ప్రాతిపదికన మొత్తం 150 పోస్టులను భర్తీ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఇది మంచి అవకాశంగా నిలవనుంది.

ఈ నియామకాల్లో 100 డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ అసిస్టెంట్ పోస్టులు, 50 హెవీ వెహికల్ డ్రైవర్ పోస్టులు ఉన్నాయి. అభ్యర్థులు గరిష్ఠంగా 35 ఏళ్లలోపు ఉండాలి. పదో తరగతి ఉత్తీర్ణత విద్యార్హతగా నిర్ణయించగా, డ్రైవర్ పోస్టులకు చెల్లుబాటు అయ్యే హెవీ వాహన డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి.

ఎంపిక పూర్తిగా శారీరక సామర్థ్య పరీక్షల ఆధారంగా జరుగుతుంది. 800 మీటర్ల పరుగును 2 నిమిషాల 50 సెకన్లలో, 100 మీటర్ల పరుగును 15 సెకన్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే 4 మీటర్ల లాంగ్ జంప్, 7.2 కిలోల షాట్‌పుట్‌ను 6 మీటర్ల దూరం విసిరే పరీక్షలను కూడా నిర్వహించనున్నారు. ఈ నియామకాలకు రాత పరీక్ష ఉండదు. అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నేరుగా హాజరు కావాలని అధికారులు సూచించారు.

# గోబర్ధన్ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

- **రూ.23,731 కోట్లతో పదేళ్లపాటు అమలు**
- **వ్యవసాయ, సేంద్రీయ వ్యర్థాలతో స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి**
- **సీబీజీ ఉత్పత్తిని పదింతలు పెంచే లక్ష్యం**
- **అస్సాంలో రూ.8,970 కోట్ల జాతీయ రహదారి ప్రాజెక్టుకూ గ్రీన్ సిగ్నల్**




**న్యూఢిల్లీ, ఆగస్టు 6:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక పథకాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దేశంలో స్వచ్ఛ ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు రూపొందించిన 'గోబర్ధన్' (జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకం)కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే అస్సాంలో గువాహటి-తేజ్‌పూర్ నాలుగు లేన్ల జాతీయ రహదారి కారిడార్ అభివృద్ధికి కూడా ఆమోదం తెలిపింది.

గోబర్ధన్ పథకాన్ని రూ.23,731 కోట్ల అంచనా వ్యయంతో 202627 నుంచి 203536 వరకు పదేళ్లపాటు అమలు చేయనున్నారు. వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ, ప్రెస్‌మడ్, పట్టణ సేంద్రీయ వ్యర్థాలను కంప్రెస్డ్ బయోగ్యాస్, సేంద్రీయ ఎరువులుగా మార్చడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. దేశీయంగా సీబీజీ ఉత్పత్తిని గణనీయంగా పెంచి స్వచ్ఛ ఇంధన రంగాన్ని బలోపేతం చేయాలని కేంద్రం భావిస్తోంది.

గ్రామీణ ప్రాంతాలను స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి కేంద్రాలుగా తీర్చిదిద్దడంతో పాటు రైతులకు అదనపు ఆదాయ వనరులు కల్పించడం కూడా ఈ పథకం ఉద్దేశాల్లో ఒకటిగా ప్రభుత్వం పేర్కొంది. వ్యర్థాలను సమర్థంగా వినియోగిస్తూ సర్క్యులర్ బయో ఎకానమీని బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపింది. మరోవైపు అస్సాంలో జాతీయ రహదారి-15 పరిధిలో గువాహటి-తేజ్‌పూర్ మధ్య 135.871 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ కారిడార్ నిర్మాణానికి రూ.8,970.20 కోట్ల వ్యయంతో కేబినెట్ ఆమోదం తెలిపింది. బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ విధానంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో తేజ్‌పూర్ బైపాస్ వద్ద భారత వైమానిక దళ అవసరాలకు అనుగుణంగా అత్యవసర విమాన ల్యాండింగ్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రస్తుత జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు బైహాత చరియాలీ, సిపాఝూర్, ఖరుపేటియా, దేకియాజులి, తేజ్‌పూర్ ప్రాంతాల్లో రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఐదు ప్రధాన బైపాస్‌ల నిర్మాణంతో ప్రాంతీయ రవాణా వ్యవస్థకు గణనీయమైన ఊతం లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.




# ఏఐ కంటెంట్‌పై కేంద్రం కఠిన నిబంధనలు

- **ఏఐ రూపొందించిన ప్రతి కంటెంట్‌కు లేబుల్ తప్పనిసరి**
- **హానికరమైన పోస్టుల తొలగింపు గడువు 36 గంటల నుంచి 3 గంటలకు**
- **ఫిర్యాదుల పరిష్కారానికి కొత్త కాలపరిమితులు**
- **డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారంపై నియంత్రణే లక్ష్యం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:**

కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా రూపొందుతున్న తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్‌లను అరికట్టేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఐటీ నిబంధనల్లో కీలక మార్పులను ప్రతిపాదించింది. కొత్త నిబంధనల ప్రకారం సోషల్ మీడియా వేదికల్లో ఏఐ ఆధారంగా రూపొందించిన ప్రతి కంటెంట్‌పై తప్పనిసరిగా 'ఏఐ' గుర్తింపు లేబుల్ ఉంచాల్సి ఉంటుంది. దీనివల్ల అసలు కంటెంట్, కృత్రిమంగా రూపొందించిన కంటెంట్‌ను వినియోగదారులు సులభంగా గుర్తించే అవకాశం కలుగుతుంది.

ప్రభుత్వం లేదా కోర్టు ఆదేశాల మేరకు చట్టవిరుద్ధమైన లేదా హానికరమైన ఏఐ కంటెంట్‌ను తొలగించేందుకు సోషల్ మీడియా సంస్థలకు ప్రస్తుతం ఉన్న 36 గంటల గడువును కేవలం 3 గంటలకు కుదించాలని కేంద్రం ప్రతిపాదించింది. డిజిటల్ వేదికల్లో తప్పుడు ప్రచారం వేగంగా వ్యాపించకుండా అడ్డుకోవడమే ఈ నిర్ణయం ఉద్దేశంగా పేర్కొంది. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంలో కూడా సమయ పరిమితులను మరింత కఠినతరం చేయాలని కేంద్రం నిర్ణయించింది. సున్నితమైన అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను 24 గంటల బదులు 2 గంటల్లోనే పరిష్కరించాల్సి ఉంటుంది. ఇతర ఫిర్యాదుల పరిష్కార గడువును 72 గంటల నుంచి 36 గంటలకు తగ్గించాలని ప్రతిపాదించింది. డిజిటల్ వేదికల్లో పారదర్శకతను పెంచడం, వినియోగదారుల భద్రతను బలోపేతం చేయడం, ఏఐ సాంకేతికత దుర్వినియోగాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఈ మార్పులను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కొత్త ప్రతిపాదనలపై అభిప్రాయాలు స్వీకరించిన అనంతరం తుది నిబంధనలను అమల్లోకి తీసుకురానుంది.


# వివాహ రద్దు ఫత్వాలు చెల్లవు

- **మతపరమైన కమిటీలకు అధికారం లేదు**
- **మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు**



**భోపాల్, ఆగస్ట్ 6 :**

మసీదు కమిటీ ఫత్వాపై మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివాహాన్ని రద్దు చేసే అధికారం ఏ మతపరమైన సంస్థలు, కమిటీలు, లేదా సెమినరీలకు లేదని స్పష్టం చేసింది. కేవలం మసీదు కమిటీ జారీ చేసిన ఫత్వా ఆధారంగా వివాహ బంధం రద్దు అయినట్లు పరిగణించలేమని తేల్చిచెప్పింది. చట్టబద్ధమైన పక్రియను అనుసరించి రాజ్యాంగబద్ధమైన ఫ్యామిలీ కోర్టుల ద్వారానే విడాకులు పొందాల్సి ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా జస్టిస్ వివేక్ జైన్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా భోపాల్ 'దారుల్‌దఫా మసాజిద్ కమిటీ' జారీ చేసిన ఫత్వా ఆధారంగా తన వివాహ బంధం రద్దు అయినట్లు ప్రకటించాలని కోరిన ఓ భర్త అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. ఫత్వాకు స్వతంత్రంగా చట్టపరమైన గుర్తింపు లేదని, అది కోర్టు తీర్పునకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది. వివాహ రద్దు వంటి అంశాల్లో తుది నిర్ణయం తీసుకునే అధికారం కేవలం కోర్టులకే ఉంటుందని వెల్లడించింది. ఈ తీర్పు మతపరమైన ఫత్వాల చట్టబద్ధత, వివాహ రద్దు పక్రియపై కీలకమైన స్పష్టతను ఇచ్చిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# తరుణ్ తేజ్‌పాల్‌కు కోర్టు షాక్

- **లైంగిక దాడి కేసులో దోషిగా గోవా ధర్మాసనం నిర్దారణ**

**ముంబై, ఆగస్ట్ 6 :**

తెహెల్కా మాజీ సంపాదకుడు తరుణ్ తేజ్‌పాల్‌ను 2013 నాటి లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టులోని గోవా ధర్మాసనం దోషిగా నిర్దారించింది. 2021లో మాపుసా కోర్టు ఇచ్చిన తీర్పును ఈ ధర్మాసనం రద్దు చేసింది. జస్టిస్ డాక్టర్ నీలా గోఖలే, జస్టిస్ అమిత్ జమ్సందేకర్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ తీర్పును వెలువరించింది. ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద తరుణ్ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్దారించింది. అతడికి విధించిన శిక్షను ధర్మాసనం ప్రకటించనుంది. గోవా ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. కుమార్తె వయస్సు ఉన్న యువతితో అతడు ఈ విధంగా వ్యవహరించారని తెలిపారు. బాధితురాలు పదే పదే తిరస్కరించినప్పటికి తేజ్‌పాల్ తన ప్రయత్నాలను కొనసాగించాడని పేర్కొన్నారు. అదీకాక మ్యాగజైన్ సంపాదకుడిగా అతడు గౌరవమైన స్థానంలో ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిందితుడు తరుణ్ తేజ్‌పాల్‌కు గరిష్ఠంగా శిక్ష విధించాలని ఈ సందర్భంగా కోర్టుకు తుషార్ మెహతా విజ్ఞప్తి చేశారు. 2013లో గోవాలోని ఓ రిసార్ట్ వేదికగా తెహెల్కా పత్రిక థింక్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా మ్యాగజైన్ సంపాదకుడు తరుణ్ తేజ్ పాల్ తనపై లైంగిక దాడి చేశాడని సహోద్యోగి ఆరోపించారు. మరికొద్దిసేపట్లో కోర్టు అతడికి శిక్ష విధించనుంది. ఈ నేపథ్యంలో తేజ్‌పాల్ స్పందించారు. తనపై దయ చూపాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. తన వయస్సు 62 ఏళ్లని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాను బాధితుడినని నమ్ముతున్నానన్నారు. తనకు భార్య కూడా ఉందన్నారు. అంతకు మించి చెప్పడానికి ఏ లేదంటూ తేజ్‌పాల్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.




# నిరుద్యోగంపైనే తదుపరి పోరాటం: సీజేపీ

- **సెప్టెంబరులో 'క్యా బోల్తీ పబ్లిక్' జాతీయ కార్యక్రమం**
- **దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై అభిప్రాయ సేకరణకు సన్నాహాలు**
- **విద్యా వ్యయాలు, నిరుద్యోగాన్ని ప్రధాన అంశాలుగా తీసుకుంటామని వెల్లడి**
- **ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని వ్యాఖ్య**

**ఛత్రపతి శంభాజీనగర్, ఆగస్టు 6:**

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఆందోళనల అనంతరం సీజేపీ తన తదుపరి కార్యాచరణను ప్రకటించింది. సెప్టెంబరులో "క్యా బోల్తీ పబ్లిక్" పేరుతో దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి, నిరుద్యోగ సమస్యను జాతీయ చర్చాంశంగా తీసుకువస్తామని ఆ పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే తెలిపారు.

మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటిపై ప్రజాభిప్రాయాన్ని సమీకరించే కార్యక్రమమే "క్యా బోల్తీ పబ్లిక్" అని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా త్వరలో రాంచీ పర్యటన కూడా చేపట్టనున్నట్లు చెప్పారు.

విద్యారంగంలో ఫీజుల భారం రోజురోజుకూ పెరుగుతోందని అభిజీత్ దీప్కే ఆరోపించారు. పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేయడం వల్ల సాధారణ, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని అన్నారు. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలనే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని విమర్శించారు.

జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసనలు కేవలం నీట్ పరీక్షకు మాత్రమే సంబంధించినవి కాదని, దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న విస్తృత సమస్యలకు ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఎన్నికైన ప్రజాప్రతినిధుల పార్టీ మార్పులు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించారు.

న్యాయ వ్యవస్థ పనితీరుపైనా అభిజీత్ దీప్కే విమర్శలు చేశారు. కొన్ని కీలక అంశాల్లో వేగంగా విచారణలు పూర్తవుతున్నప్పటికీ, సాధారణ ప్రజలకు సంబంధించిన కేసులు మాత్రం దీర్ఘకాలం పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ప్రతి పౌరుడికి సమానంగా, త్వరితగతిన న్యాయం అందేలా వ్యవస్థలు పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# హోటళ్లు, రెస్టారెంట్లలో ఉచిత తాగునీరు తప్పనిసరి

- **మహారాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం**
- **నిబంధనలు పాటించని యజమానులపై కఠిన చర్యలు**
- **తాగునీరు అందుబాటులో ఉందని బోర్డులు ఏర్పాటు చేయాలి**
- **ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలంటూ డిమాండ్లు**



**ముంబై, ఆగస్టు 6:**

హోటళ్లు, రెస్టారెంట్లకు వచ్చే వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రతి వినియోగదారుడికి ఉచితంగా సురక్షితమైన తాగునీటిని అందించడం తప్పనిసరి చేస్తూ కొత్త మార్గదర్శకాలను అమల్లోకి తీసుకొచ్చింది. మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ తుకారాం ముండే జారీ చేసిన ఆదేశాల ప్రకారం, ప్రతి రెస్టారెంట్‌లో "ఉచిత సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంది" అనే బోర్డును స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి. వినియోగదారులను తప్పనిసరిగా ప్యాకేజ్డ్ వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసేలా ఒత్తిడి చేయకుండా ఈ నిర్ణయం దోహదపడనుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించే హోటల్, రెస్టారెంట్ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఉచిత తాగునీరు అందించకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు.

మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రశంసలు లభిస్తున్నాయి. ఇదే విధానాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని పలువురు వినియోగదారులు, నెటిజన్లు ప్రభుత్వాలను కోరుతున్నారు.

# యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్..

- **యూపీఐ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం**
- **వాయిస్ ఓటుతో చర్చ లేకుండానే బిల్లు పాస్**
- **యూపీఐపై ఛార్జీలకు చట్టపరమైన మార్గం**
- **ఎండీఆర్ మినహాయింపు నిబంధన తొలగింపు**
- **పెద్ద వ్యాపారులకే ఛార్జీలు వర్తించే అవకాశం**
- **సాధారణ వినియోగదారులకు ప్రభావం ఉండదని సంకేతాలు**




డిజిటల్ చెల్లింపులకు సంబంధించి కీలక మార్పులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశానికి మార్గం సుగమం చేసే 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (సవరణ) బిల్లు 2026'ను లోక్‌సభ గురువారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు పాస్ అయింది. ప్రస్తుతం యూపీఐ సహా కొన్ని డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) వసూలు చేయకుండా చట్టపరమైన నిబంధన ఉంది. తాజా సవరణతో ఆ నిబంధన తొలగనుంది. దీంతో భవిష్యత్‌లో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీలపై సేవా రుసుములు అమల్లో ఉండగా, యూపీఐకి మాత్రం మినహాయింపు ఉంది. కొత్త బిల్లుతో ఆ పరిస్థితి మారనుంది. అయితే ఈ ఛార్జీలు సాధారణ వినియోగదారులపై కాదు. నిర్దిష్ట పరిమితికి మించిన యూపీఐ లావాదేవీలు చేసే పెద్ద వ్యాపారులు, వ్యాపార సంస్థలకే వర్తించే అవకాశం ఉందని సమాచారం. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు, మౌలిక సదుపాయాల సంస్థలకు ఆదాయం సమకూర్చడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ఛార్జీల శాతం, ఏ స్థాయి లావాదేవీలకు వర్తిస్తాయనే అంశాలపై కేంద్ర ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు తర్వాత స్పష్టత ఇవ్వనున్నాయి.

# యూనిఫామ్ పంపిణీ త్వరగా పూర్తి చేయాలి






- విద్యార్థుల హాజరు, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా
- విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్ష

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ ప్రక్రియను సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని, పంపిణీకి ముందు యూనిఫామ్ నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. డీఆర్డీఏ, మెప్మా, విద్యాశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో యూనిఫామ్ పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర సమాచారానికి సంబంధించిన "అపార్" నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆధార్ వివరాల్లో పొరపాట్ల వల్ల జాప్యం జరిగితే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి సవరణలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ బాధ్యతను ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతిరోజూ కనీసం 95 శాతం మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను ఎంఈఓలు పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. వర్షాకాలంలో పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ, మోడల్ పాఠశాలల్లో నిర్దేశిత లక్ష్యం పూర్తయ్యే వరకు విద్యార్థుల ప్రవేశాలను కొనసాగించాలని, విద్యాశాఖ ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహిస్తూ లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాధికారి చైతన్య జైని, ఏడీ ప్రశాంత్ రెడ్డి, కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, ఎంఈఓలు పాల్గొన్నారు

# 'అక్షర'లో అలరించిన బోనాల వేడుకలు







**శెనార్తిమీడియా, రామడుగు:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకైన బోనాల పండుగను రామడుగు మండలం గోపాల్ రావుపేట అక్షర హైస్కూల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, టీచర్లు భక్తిశ్రద్ధలతో బోనాలను అలంకరించారు. అబ్బాయిలు పోతరాజు, పులి వేషధారణలతో డ్యాన్సులు చేస్తూ ఆకట్టుకున్నారు. బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేస్తూ పోచమ్మకు సమర్పించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మినుకుల మునీందర్, డైరెక్టర్ మినుకుల రాధ, టీచర్స్ పాల్గొన్నారు.



# ప్రోటోకాల్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండల ఎంపీడీవో కార్యాలయంలో ఆగస్టు 5న నిర్వహించిన గ్రామ అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష సమావేశంలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందని మండల సర్పంచులు ఆరోపించారు. సమావేశానికి మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించగా, సర్పంచులతో పాటు మండల అధికారులు హాజరయ్యారు. సమీక్ష సమావేశంలో సింగిల్ విండో చైర్మన్లను వేదికపై కూర్చోబెట్టి వారికి సమీక్ష బాధ్యతలు అప్పగించడం ద్వారా ప్రజా ప్రతినిధులైన సర్పంచులను అవమానించారని వారు పేర్కొన్నారు. ప్రోటోకాల్‌ను ఉల్లంఘించి సర్పంచుల గౌరవానికి భంగం కలిగించిన మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, మండల పంచాయతీ అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# ఆచార్య జయశంకర్‌కు ఘన నివాళి



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంతకర్తగా ఆచార్య జయశంకర్ చిరస్థాయిగా గుర్తుండిపోతారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన ఆయన ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అనంతరం ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చు రాజయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎల శేఖర్ బాబు, బెజ్జంకి ఉపసర్పంచ్ మహేష్, ఎలుక దేవయ్య, పట్టణ అధ్యక్షుడు వంగల నరేష్, బీసీ సెల్ అధ్యక్షుడు కల్లూరి రమేష్, వార్డు సభ్యులు తిప్పరపు మహేష్, లింగాల వెంకటేష్, పొట్లపల్లి శివకృష్ణ, మల్లికార్జున్, కల్లూరి అజయ్, ఇట్టిరెడ్డి బాల్ రెడ్డి, మాషం బాబు, మొగిలి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## రూ.5 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన జీపీఓ

**శెనార్తి మీడియా, జగిత్యాల :** మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన గ్రామపాలన అధికారి (జీపీఓ) రాజేష్ రూ.5 వేల లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. ఆత్మకూర్ గ్రామానికి చెందిన ఓ రైతు తన పట్టాదారు పాస్‌బుక్‌లో తప్పుగా నమోదైన పేరును సరిచేయాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఆ దరఖాస్తును పరిష్కరించేందుకు జీపీఓ రాజేష్ రూ.5 వేల లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు వల పన్ని, బాధితుడి నుంచి రూ.5 వేల లంచం తీసుకుంటున్న సమయంలో జీపీఓ రాజేష్‌ను పట్టుకున్నారు.

# పెన్షన్ నిబంధనలు సవరించాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెన్షన్ అర్హత నిబంధనలు పేదలు, వృద్ధులు, వితంతు మహిళలు సహా నిజమైన అర్హులకు అన్యాయం చేసేలా ఉన్నాయని భారతీయ జనతా పార్టీ శంకరపట్నం మండల శాఖ అధ్యక్షుడు ఏనుగుల అనిల్ విమర్శించారు. వృద్ధాప్య పెన్షన్‌ను 70 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే పరిమితం చేయడం సరికాదని, 57 సంవత్సరాలు దాటిన పేద వృద్ధుల్లో ఎంతో మంది ఉపాధి చేయలేని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. అందువల్ల వృద్ధాప్య పెన్షన్ అర్హత వయస్సును 70 నుంచి 57 సంవత్సరాలకు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వితంతు మహిళలకు 40 సంవత్సరాల వయోపరిమితి విధించడం కూడా అన్యాయమేనని, భర్తను కోల్పోయిన మహిళ ఏ వయస్సులో ఉన్నా ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. వయోపరిమితి లేకుండా అర్హులైన ప్రతి వితంతు మహిళకు పెన్షన్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన ఇతర అర్హత నిబంధనలను కూడా పునఃసమీక్షించి, నిజమైన పేదలకు న్యాయం జరిగేలా సవరణలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల విజ్ఞప్తులను ప్రభుత్వం పట్టించుకోకపోతే, ఈ నిబంధనలను ఉపసంహరించుకోకుంటే బీజేపీ శంకరపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లో ధర్నాలు, నిరసనలు చేపడతామని ఏనుగుల అనిల్ హెచ్చరించారు.



# బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు ఇవ్వాలి



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు ఇవ్వాలని, తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు తప్ప మరే ఆహారం ఇవ్వకూడదని జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని కోతిరాంపూర్ సెక్టార్ లక్ష్మీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు సాధారణ ప్రసవానికి అనుకూలంగా పోషకాహారం తీసుకోవడంతో పాటు తగిన వ్యాయామం చేయాలని సూచించారు. 38వ డివిజన్ కార్పొరేటర్ దేవసాని సరస్వతి, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్ మాట్లాడుతూ, తల్లిపాలలో శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే ప్రతిరక్షకాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. తల్లిపాలు తాగే పిల్లల్లో విరేచనాలు, శ్వాసకోశ వ్యాధులు, పోషకాహార లోపం వంటి సమస్యలు తక్కువగా ఉంటాయని వివరించారు. ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం ప్రారంభించినప్పటికీ రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం శిశువు సంపూర్ణ ఎదుగుదలకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. తల్లిపాలు శిశువుకే కాకుండా తల్లికి కూడా ఎంతో మేలు చేస్తాయని, ప్రసవానంతరం త్వరగా కోలుకోవడం, అధిక రక్తస్రావం తగ్గడం, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో దోహదపడతాయని వివరించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను వీడి ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాశన, ఉయ్యాల వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో 38వ డివిజన్ కార్పొరేటర్ దేవసాని సరస్వతి, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్, సీడీపీఓ కవిత, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎస్. అరుణ, చైల్డ్‌లైన్ సాయి కిరణ్, వైద్యాధికారి రాజ్‌కుమార్, హెల్త్ సూపర్వైజర్ ఎంకే బేక్, అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, పద్మ, సరిత, పద్మావతి, పద్మలత, వనజ, గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన





**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం కన్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడిఎస్ సూపర్వైజర్ అరుణ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అనూష మాట్లాడుతూ, పుట్టిన శిశువులకు డబ్బా పాలు కాకుండా తల్లిపాలనే అందించాలని సూచించారు. జననం అనంతరం వెంటనే ముర్రుపాలు పట్టించడం వల్ల శిశువుకు అవసరమైన పోషకాలు అందడంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారమని, ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్వేత జెండర్ స్పెషలిస్ట్ శైలజ, గండికోట రవి, అంగన్‌వాడీ టీచర్లు కాటం రాజమణి, కాంత, ఆశ, తల్లులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత




**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం మొలంగూరు గ్రామాని కి చెందిన గాజుల సామ్ సన్ పోగొట్టుకున్న మొబై ల్ ఫోన్ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశా డు. కేశవపట్నం పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీఈఐఆర్ (CEIR) పోర్టల్ సహాయంతో మొబైల్ ఫోన్‌ను ట్రేస్ చేసి గుర్తించారు. అనంతరం స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి మాట్లాడారు., సెల్ ఫోన్ పోయిన వెంటనే సమీప ఠాణాలో ఫిర్యాదు చేయాలని సూచించారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి తిరిగి అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.




# జయశంకర్ ఆశయాలు నేటి తరాలకు ఆదర్శం..

- తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పోరాటం చిరస్మరణీయం..
- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డీ శ్రీనివాస్ రెడ్డి
- ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన పోరాటం చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు, అందించిన స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, ఆర్డీవో షర్మిల, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని వాహనాలపై కఠిన చర్యలు

**శెనార్తి మీడియా, జగిత్యాల:**

వాహనదారులు తప్పనిసరిగా ట్యాక్స్, ఫిట్‌నెస్, పర్మిట్ తదితర చట్టబద్ధమైన పత్రాలతోనే వాహనాలు నడపాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణా అధికారి సందాని హెచ్చరించారు. గురువారం జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిలోని ఆర్టీసీ బస్సు డిపో సమీపంలో మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ సాయి చరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో చెల్లుబాటు అయ్యే ట్యాక్స్, ఫిట్‌నెస్, పర్మిట్ తదితర పత్రాలు లేకుండా నడుపుతున్న వాహనాలపై చర్యలు తీసుకున్నారు. మొత్తం 10 కేసులు నమోదు చేసి సంబంధిత వాహనాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాల్లో మూడు మోటార్ క్యాబ్‌లు, మూడు గూడ్స్ వాహనాలు, రెండు ట్రాక్టర్లు, రెండు త్రీ వీలర్ గూడ్స్ క్యారేజ్ వాహనాలు ఉన్నాయి. రవాణా నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణా అధికారి సూచించారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో బంగారు భవిష్యత్

- **కొలనుపాకలో ఆయిల్ ఫామ్ తోటను సందర్శించిన వ్యవసాయ అధికారులు, రైతులు ప్రభుత్వ రాయితీలను వినియోగించుకోవాలని సూచన**

**ఆలేరు, ఆగస్టు 6** : ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడంలో భాగంగా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతు సొంటెం సోములు, బుజ్జమ్మ, నిర్మల, కల్పనల వ్యవసాయ క్షేత్రాన్ని మండల వ్యవసాయ అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి ఆయిల్ ఫామ్ తోటను పరిశీలించి, పండిన గెలలను కోయించారు. పంట సాగు విధానం, నిర్వహణ, దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేపట్టాలని సూచించారు. ఆయిల్ ఫామ్ దీర్ఘకాలిక ఆదాయం అందించే లాభదాయకమైన పంట అని పేర్కొన్నారు. ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ ఫామ్‌కు కోతుల బెడద, అడవి పందుల వల్ల నష్టం, వడగండ్ల వాన ప్రభావం చాలా తక్కువగా ఉంటుందని చెప్పారు. మొక్కలను మొదటి మూడు సంవత్సరాలు శ్రద్ధగా సంరక్షిస్తే మూడో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమై సుమారు 30 సంవత్సరాల వరకు స్థిరమైన ఆదాయం అందుతుందని వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు రైతులకు



దీర్ఘకాలికంగా ఆర్థిక భరోసా కల్పించే పంటగా మారుతోందని, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఈ పంటను సాగు చేయడం ద్వారా మంచి లాభాలు పొందవచ్చని రైతులకు సూచించారు.ఈ క్షేత్ర సందర్శనలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శివకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైసయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరమల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- **ఆలేరులో బూత్ స్థాయి ముగింపు సమావేశం: పాల్గొన్న బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు**

**ఆలేరు, ఆగస్టు 6** : ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా ఆలేరు పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బూత్ నంబర్లు 180, 181కు సంబంధించిన ప్రత్యేక సవరణ కార్యక్రమం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) హాజరై ఓటరు జాబితా సవరణ



ప్రక్రియను సమీక్షించారు. సమావేశంలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలపై చేపట్టిన చర్యలను బీఎల్‌వోలు వివరించారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం, పారదర్శకతను కాపాడేలా ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించినట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ తరపున ఆలేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముదిగొండ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకుడు తాళ్లపల్లి మహేష్ సమావేశానికి హాజరై బూత్‌ల పరిధిలో నిర్వహించిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో బీఎల్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల బీఎల్ఏలు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**

**నారాయణపేట, ఆగస్టు,06**

నారాయణపేట: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సిద్ధాంతపరంగా బలమైన పునాది వేసి, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా నారాయణపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితమంతా తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి కోసం అంకితం చేశారని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఆయన అందించిన మేధోపరమైన మార్గదర్శకత్వం, నిబద్ధత, త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ కేవలం ఉద్యమకారుడే కాకుండా గొప్ప విద్యావేత్త, ఆలోచనాపరుడు, సమాజ సంస్కర్త అని ఎస్పీ కొనియాడారు. యువత ఆయన నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం, విలువలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. దేశం, రాష్ట్రం పట్ల బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని





ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో DCRB డీఎస్పీ మహేష్, ఆఫీస్ సూపర్డెంట్ శ్యామ్ సుందర్ రాజు,ఎస్సై లు పురుషోత్తం, శ్రీనివాసులు, శ్వేత, శిరీష, వివిధ విభాగాల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# అమ్మపాల చుక్కలోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు...

- **ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శాయంపేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం**
- **చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించిన డాక్టర్ అనితా రెడ్డి**

**హన్మకొండ/శాయంపేట, ఆగస్టు 6** : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శాయంపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. శిశువుకు తల్లిపాలే సంపూర్ణమైన, శ్రేష్ఠమైన ఆహారమని, ముఖ్యంగా పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) అత్యంత విలువైనవని చెప్పారు. అవి శిశువుకు రోగనిరోధక శక్తిని



పెంపొందించడంతో పాటు అవసరమైన పోషకాలను అందిస్తాయని, ప్రతి తల్లి తప్పనిసరిగా శిశువుకు ముర్రుపాలు అందేలా చూడాలని సూచించారు.గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆకుకూరలు, ముఖ్యంగా మునగాకు వంటి పోషక విలువలు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. తల్లిపాలు ఇస్తున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు.గతంలో ఉమ్మడి కుటుంబాల్లో పెద్దలు తల్లులకు సరైన సూచనలు ఇచ్చేవారని, ప్రస్తుతం చిన్న కుటుంబాల కారణంగా అవగాహన లోపం, జంక్ ఫుడ్ వినియోగం పెరగడం వల్ల తక్కువ బరువుతో, పోషకాహార లోపంతో పిల్లలు జన్మిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితులను నివారించడంలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, వారు నిర్వహించే అవగాహన కార్యక్రమాలు, గృహ సందర్శనల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం ఆహారం తీసుకునే ముందు చేతులను పరిశుభ్రంగా ఎలా కడుక్కోవాలో చిన్నారులకు ప్రదర్శించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల బరువును పరిశీలించి, వారి ఎదుగుదలను అంచనా వేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార లోపం నివారణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ఏ చిన్నారి కూడా పోషకాహార లోపంతో బాధపడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజాసంఘాల వినతిపత్రం

- **ఇందిరా డెయిరీ ఫామ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కడా అధికారులకు విజ్ఞప్తి**

**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,06**

కొడంగల్:తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి (TSMHPS) ఆధ్వర్యంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆఫీసర్‌కి వినతిపత్రం సమర్పించారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరా డెయిరీ ఫామ్' పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన లబ్ధిదారులకు మంజూరైన నిధులను తక్షణమే విడుదల చేయాలని, అలాగే నూతన దరఖాస్తులను స్వీకరించాలని నాయకులు కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కొడంగల్ ప్రాంతంలో నిరుద్యోగ యువత, పేద రైతులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని ప్రారంభించి తొమ్మిది నెలలు గడుస్తున్నా, ఇంతవరకు నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమకాకపోవడం తీవ్ర ఆందోళనకరమన్నారు. పరిపాలనా అనుమతులు (Proceedings) జారీ చేసి నెలలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల అర్హులైన పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా, ప్రస్తుతం కొత్తగా దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకపోవడంతో నియోజకవర్గంలోని వేలాది మంది అర్హులైన రైతులు, పేదలు పథకం ప్రయోజనాలకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నూతన అప్లికేషన్లను స్వీకరించి, పెండింగ్‌లో ఉన్న నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని కడా అధికారులను



కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు వాహబ్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్, TSMHPS తాండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాధిఖ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస చంద్రయ్య, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల హక్కుల సమితి జిల్లా అధ్యక్షులు కే. చంద్రయ్య, డాక్టర్ నవాజ్, మాజీ సర్పంచ్ ఫాహిముద్దీన్, TSMHPS కొడంగల్ పట్టణ అధ్యక్షులు రఫీక్, అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**హైదరాబాద్, ఆగస్టు 6** : తెలంగాణ ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు ఆహార భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త లామినేటెడ్ ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఈ కార్యక్రమాన్ని సంగారెడ్డిలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రారంభించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ చేపట్టనున్నారు.ఆహార & పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక మెమో జారీ చేస్తూ, కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను పకడ్బందీగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల జాబితాల ఖరారు, కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పేద కుటుంబాలందరికీ ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలు చేరేలా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

## బీపీ మిషన్ స్టెతస్కోప్ అందజేత.



**వలిగొండ ఆగస్టు 06**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజుపల్లి గ్రామం స్థానిక ఉప సర్పంచ్ పోలబోయిన లింగస్వామి తన సొంత ఖర్చులతో స్థానిక సర్పంచ్ సలిగంజి పృథ్వి చేతుల మీదగా బీపీ మిషన్ స్టెతస్కోప్ స్థానిక ఆశా కార్యకర్త నీలం నీరజ కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవనీత ఉపాధ్యాయులు రేవతి అంగన్వాడి టీచర్ ఎన్ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి.



**వలిగొండ ఆగస్టు 06**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను గురువారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్క ఉద్యమకారుడు ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం సీనియర్ నాయకులు చిలుగూరి సత్తిరెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి, బొడిగెసుదర్శన్,కన్నె కంటి శ్రీనివాసచారి, ఐటి పాముల పుష్ప, కొండూరు సత్తయ్య, దండ మల్లికార్జున్, పల్లెర్ల రామచందర్, ఉక్కుర్తి యాదగిరి, పారుపల్లి నరసింహ, వనం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్–కార్యక్రమం 100% పూర్తి.డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్.



**కొడంగల్ మున్సిపల్(మం)ఆగస్టు,06**


మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్మన్ & కొడంగల్ మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్ తో కలసి వివరాలు వెల్లడించిన డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్.కొడంగల్ నియోజకవర్గంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన Special Intensive Revision (SIR) కార్యక్రమం విజయవంతంగా 100% పూర్తి చేస్తాం.ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన

- బూత్ లెవెల్ ఆఫీసర్లు (BLOs)
- బూత్ లెవెల్ ఏజెంట్లు (BLAs)
- పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు
- నియోజకవర్గ ప్రజలు

అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అన్నారు.ప్రత్యేకంగా, ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయిలో అంకితభావంతో పనిచేసిన సిబ్బంది వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామనీ కృతజ్ఞత పరిచారు. ఇకముందు కూడా ఓటరు హక్కులను పరిరక్షిస్తూ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరుతున్నామనీ తెలిపారు...

# చెన్నై సూపర్ కింగ్స్‌కు మరో షాక్..

**స్పోర్ట్స్ డెస్క్ :**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీల్లో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు మరో ఎదురుదెబ్బ తగలనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సీఎస్‌కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ఫ్రాంచైజీని వీడగా.. ఇప్పుడు బ్యాటింగ్ కోచ్ మైకేల్ హస్సీ కూడా జట్టుకు వీడ్కోలు చెప్పేందుకు సిద్ధమయ్యాడని పలు అంతర్జాతీయ మీడియాలు తమ కథనాల్లో పేర్కొన్నాయి. ఇంగ్లండ్ టెస్ట్ జట్టు కొత్త హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్న స్టీఫెన్ ఫ్లెమింగ్.. తన కోచింగ్ బృందంలో బ్యాటింగ్ కోచ్‌గా చేరాలని మైకేల్ హస్సీని సంప్రదించినట్లు సమాచారం. ఈ విషయంపై ఫ్లెమింగ్, హస్సీలు ఇప్పటికే చర్చించినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ)తో అధికారిక ఒప్పందం కుదరలేదని తెలుస్తోంది. ప్రస్తుతం 51 ఏళ్ల హస్సీ 'ది హండ్రెడ్' టోర్నీలో వెల్ష్ ఫైర్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. అదే సమయంలో




ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ కోచ్‌గా కూడా కొనసాగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ జట్టులో చేరాలా? లేక సీఎస్‌కేతోనే కొనసాగాలా? అనే విషయంపై హస్సీ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. స్టీఫెన్ ఫ్లెమింగ్, మైకేల్ హస్సీల మధ్య దాదాపు 15 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. 2008లో ఐపీఎల్ ప్రారంభ సీజన్‌లో ఇద్దరూ సీఎస్‌కే తరఫున కలిసి ఆడారు. అనంతరం ఫ్లెమింగ్ హెడ్ కోచ్‌గా.. హస్సీ బ్యాటింగ్ కోచ్‌గా కలిసి చెన్నై జట్టుకు ఎన్నో విజయాలు అందించారు. ఇప్పుడు అదే జోడీ ఇంగ్లండ్ జట్టులో కూడా కనిపించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఫ్లెమింగ్ డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనతో ఇంగ్లండ్ టెస్ట్ జట్టు కోచ్‌గా అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఆగస్టు 19 నుంచి పాకిస్థాన్‌తో జరిగే మూడు టెస్ట్‌ల సిరీస్‌కు మార్కస్ ట్రెస్కోతిక్ తాత్కాలిక హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. బౌలింగ్ కోచ్ విషయంలో కూడా సీఎస్‌కేతో అనుబంధం ఉన్న మరో కోచ్ ఎరిక్ సిమన్స్‌ను ఇంగ్లండ్ జట్టులోకి తీసుకురావాలని స్టీఫెన్ ఫ్లెమింగ్ ప్రయత్నిస్తున్నాడట. ప్రస్తుతం సిమన్స్ సీఎస్‌కేకు బౌలింగ్ కన్సల్టెంట్‌గా సేవలందిస్తున్నాడు. గతంలో భారత జట్టు 2011 వన్డే ప్రపంచ కప్ గెలిచిన సమయంలో బౌలింగ్ కోచ్‌గా కూడా పనిచేశాడు. దక్షిణాఫ్రికా జట్టులో కోచ్‌గా పనిచేశారు. ఒకవేళ హస్సీ కూడా ఇంగ్లండ్ జట్టులో చేరితే.. చెన్నై కోచింగ్ విభాగంలో భారీ మార్పులు తప్పవు. ఇప్పటికే జట్టు ప్రదర్శన అంతంత మాత్రంగా ఉంది.. ఇప్పుడు హస్సీ కూడా వెళ్ళిపోతే సీఎస్‌కే పరిస్థితి దారుణంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చెన్నై భవిష్యత్‌పై ఫాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్, విరాట్ ప్లేస్ కన్ఫామ్!

**స్పోర్ట్స్ డెస్క్ :**
మరికొద్ది నెలల్లో వన్డే క్రికెట్ వరల్డ్ కప్ జరగనున్న క్రమంలో భారత సీనియర్ ప్లేయర్లు అయిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి (Rohit Sharma, Virat Kohli) జట్టులో కొనసాగడంపై అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో 2027 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌కు (2027 ODI World Cup) రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ఎంపిక, వారి భవిష్యత్తుపై జరుగుతున్న చర్చలకు టీమిండియా మేనేజ్‌మెంట్ స్పష్టతనిచ్చింది. అనుభవం, అద్భుతమైన ఫామ్ దృష్ట్యా ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు 2027 వన్డే ప్రపంచ కప్ ప్రణాళికల్లో కీలక భాగంగా కొనసాగుతారని క్రికెట్ వర్గాలు తెలిపాయి. గతంలో సీనియర్ ఎంపిక కమిటీ, కోచ్ గౌతమ్ గంభీర్ కూడా వీరిద్దరూ తగినంత ఫిట్‌నెస్ సాధించి, ఫామ్‌లో ఉంటే 2027 వన్డే ప్రపంచకప్ వరకు నిరభ్యంతరంగా ఆడుతారని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన సిరీస్‌లలో సైతం రోహిత్ శర్మ సెంచరీతో చెలరేగగా, విరాట్ కోహ్లి అర్ధ సెంచరీ తో



రాణించి తమ బ్యాటింగ్ సత్తాను మరోసారి నిరూపించుకున్నారు. ఇద్దరి అనుభవం యువ ఆటగాళ్లకు దిశానిర్దేశం చేయడానికి, జట్టును ముందుకు నడిపించడానికి ఎంతో అవసరమని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. వన్డే ప్రపంచకప్ సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న భారత్, అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న రోహిత్, కోహ్లి సేవలను రాబోయే మెగా టోర్నీ వరకు ఉపయోగించుకునే దిశగానే అడుగులు వేస్తోంది. దీంతో మరోసారి రోకో కాంబినేషన్ న్ ఇష్టపడే క్రికెట్ అభిమానులు వన్డే వరల్డ్ కప్ కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నారు.

## వైభవ్ జాగ్రత్తగా ఉండాలి : రాబిన్



**స్పోర్ట్స్ డెస్క్ :**
: భారత టీనేజ్ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రతిభపై భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప తీవ్ర ప్రశంసలు కురిపిస్తూనే, అతని భవిష్యత్తుపై పలు కీలక వ్యాఖ్యలు చేశాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్‌ను మించిన ప్రభావాన్ని చూపే సామర్థ్యం వైభవ్‌కు ఉందని కొనియాడిన ఉతప్ప, రాబోయే ఐదేళ్లపాటు ఆటపరంగా, వ్యక్తిత్వ పరంగా ఎలాంటి పొరపాట్లు చేయకుండా అత్యంత క్రమశిక్షణతో నడుచుకోవాలని సూచించారు. ప్రస్తుతం వైభవ్ మాటల్లో అమాయకత్వం కనిపిస్తోందని, వ్యాపార ప్రకటనల ఆఫర్లను పక్కనపెట్టి కేవలం క్రికెట్‌పైనే దృష్టి సారించడం ఎంతో అభినందనీయమని ఉతప్ప పేర్కొన్నారు.
అయితే 18 ఏళ్లు నిండిన తర్వాత ఎదురయ్యే ఆకర్షణలకు, ముఖ్యంగా అమ్మాయిల సాహవాసాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అంతేకాకుండా ప్రస్తుతానికి అతడు సోషల్ మీడియా వాడకపోవడమే మంచిదని, క్రికెట్ కోసం పుట్టిన ఈ కుర్రాడిని బయటి ప్రపంచపు ఒత్తిళ్లకు గురిచేయకుండా ఆటలోనే కొనసాగేలా చూడాలని కోరారు. బయటి ఆకర్షణలకు దూరంగా ఉంటూ కేవలం తన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెడితే వైభవ్ భారత క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తాడని ఉతప్ప అభిప్రాయపడ్డారు.

# వన్డే వరల్డ్ కప్‌కు కౌంట్ డౌన్ స్టార్ట్..

- షెడ్యూల్ ఖరారు చేసిన ఐసీసీ..

**స్పోర్ట్స్ డెస్క్ :**
అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) ప్రతిష్టాత్మక 2027 వన్డే ప్రపంచకప్ అర్హత పోటీల ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా 2027 ప్రపంచకప్ క్వాలిఫైయర్ టోర్నీని ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు నిర్వహించాలని ఐసీసీ నిర్ణయించింది. అయితే ఈ టోర్నీ వేదికను ఇంకా ఖరారు చేయాల్సి ఉంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న 2027 ప్రపంచకప్ అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు 12 వేదికల్లో జరగనుంది. నయా ఫార్మాట్ ప్రకారం.. 10 జట్లు పాల్గొనే ఈ క్వాలిఫైయర్‌లో విజేతగా నిలిచిన జట్టు 14 జట్ల ప్రధాన ప్రపంచకప్ గ్రూప్ స్టేజ్‌కు నేరుగా అర్హత సాధిస్తుంది. ఆ తర్వాత రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే జట్లు సూపర్స్ సిరీస్ (మొదటి రౌండ్)లో పోటీపడతాయి. అందులో అగ్రస్థానంలో నిలిచే జట్టు 12 జట్ల ప్రధాన దశకు చేరుకుంటుంది. ఈ 10 జట్ల క్వాలిఫైయర్‌లో స్థానాల కేటాయింపు కూడా ఆసక్తికరంగా ఉంది. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సెప్టెంబర్ 30, 2026 నాటికి అతి తక్కువ ర్యాంక్ ఉన్న ఇద్దరు ఫుల్ మెంబర్లు (ఆతిథ్య దక్షిణాఫ్రికా, జింబాబ్వే కాకుండా) ఈ రేసులో ఉంటారు. వారితో పాటు సిడబ్ల్యూసి లీగ్2 నుండి టాప్4 జట్లు, క్వాలిఫైయర్ ప్లేఆఫ్స్ నుండి టాప్4 జట్లు ఇందులో పోటీపడతాయి. ప్లేఆఫ్స్ కోసం లీగ్2 లోని దిగువ 4 జట్లు, ఛాలెంజ్ లీగ్ లోని 4 జట్లు తలపడతాయి. ఛాలెంజ్ లీగ్‌లో 12 జట్లను రెండు పూల్‌లుగా విభజించి లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మాజీ ఛాంపియన్ వెస్టిండీస్ పరిస్థితి ప్రస్తుతం దారుణంగా ఉంది. 10వ ర్యాంక్‌లో ఉన్న విండీస్ సెప్టెంబర్ కట్ ఆఫ్ లోపు భారత్‌తో కేవలం రెండు వన్డేలు మాత్రమే ఆడనుంది. మరోవైపు అఫ్గానిస్థాన్ (8వ ర్యాంక్), ఐర్లాండ్ (12వ ర్యాంక్) సిరీస్ ఫలితాలు కూడా విండీస్ అవకాశాలను ప్రభావితం చేస్తాయి. ఐర్లాండ్ 41 లేదా 50తో అఫ్గానిస్థాన్‌పై గెలిస్తే, భారత్‌పై రెండు విజయాలు విండీస్‌ను టాప్8లోకి తీసుకెళ్తాయి. ఒకవేళ అఫ్గానిస్థాన్ గెలిస్తే, విండీస్ మళ్లీ క్వాలిఫైయర్స్ ఆడక తప్పదు. 2023లో నెదర్లాండ్స్ చేతిలో ఓడి ప్రపంచకప్‌కు దూరమైన వెస్టిండీస్‌కు ఈసారి అర్హత సాధించడం సవాలుగా మారింది.




## ఎన్ని అడ్డంకులు ఎదురైనా జట్టులోకి వస్తా: షమీ

**స్పోర్ట్స్ డెస్క్ :**
భారత జట్టులో రీఎంట్రీ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు మహమ్మద్ షమీ. బీసీసీఐ నుంచి పిలుపు వస్తుందని, ఎన్నో నెలలుగా వేచి చూస్తున్నాడు. అయినప్పటికీ కొత్త క్రికెటర్లకు ఛాన్సులు ఇస్తున్నారు తప్ప.. మంచి ప్రదర్శన చేస్తున్న షమీకి అవకాశం ఇవ్వడం లేదు. అయితే లేటెస్ట్ గా తన రీఎంట్రీ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు మహమ్మద్ షమీ. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కచ్చితంగా భారత జట్టులోకి తిరిగి వస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. తనకు ఆ నమ్మకం ఉందని పేర్కొన్నారు. తన అభిమానులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని, త్వరలోనే భారత జెర్సీలో తనను చూస్తారని ప్రకటించారు. దీంతో మహమ్మద్ షమీ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. కాగా 2027 వన్డే వరల్డ్ కప్ నేపథ్యంలో మహమ్మద్ షమీని తీ



సుకోవాలని డిమాండ్లు వస్తున్నాయి. 2023 వరల్డ్ కప్ లో అత్యధిక వికెట్లు తీసిన ప్లేయర్‌గా మహమ్మద్ షమీకి రికార్డులు ఉన్నాయి. బుమ్రా తరచూ గాయాల బారిన పడుతున్నాడు. ఇలాంటి క్రమంలో షమీ అవసరం భారత జట్టుకు ఉంటుందని మాజీ క్రికెటర్లు కూడా స్పష్టం చేస్తున్నారు. మరి దీనిపై బీసీసీఐ ఎలా ముందుకు వెళ్తుందో చూడాలి.




## టీ20ల్లో వరల్డ్ రికార్డు సృష్టించిన బట్లర్

ఇంగ్లాండ్ బ్యాటర్ జోస్ బట్లర్ వరల్డ్ రికార్డు సృష్టించాడు. టీ20ల్లో అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు.'ది హండ్రెడ్' టోర్నీలో అతను ఈ మైలురాయిని చేరుకున్నాడు. ఇంతకుముందు ఈ ఘనత వెస్టిండీస్‌కు చెందిన కీరన్ పొలార్డ్ పేరిట ఉండేది. అతను 14,803 రన్స్ చేశాడు. 'ది హండ్రెడ్' టోర్నీలో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ తరఫున ఆడిన అతను వేల్స్‌ఫైర్‌తో జరిగిన మ్యాచ్‌లో పొలార్డ్ రికార్డును బద్దలుకొట్టాడు. 20 బంతుల్లో 51 రన్స్ చేసిన బట్లర్ మొత్తం టీ20ల్లో 14,833 రన్స్ చేసి టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా అవతరించాడు. పొలార్డ్ 746 మ్యాచ్‌ల్లో ఈ ఫీట్ సాధిస్తే బట్లర్ కేవలం 522 గేముల్లోనే ఈ ఘనత సాధించడం విశేషం. టీ20 కెరీర్‌లో బట్లర్ 9 సెంచరీలు, 105 హాఫ్ సెంచరీలు చేశాడు. పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్ల జాబితాలో బట్లర్ అగ్రస్థానంలో ఉండగా.. పొలార్డ్(14,803 రన్స్), క్రిస్ గేల్(14, 562), అలెక్స్ హేల్స్(14, 449), డేవిడ్ వార్నర్(14, 284) టాప్ 5లో ఉన్నారు. భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి 14,218 రన్స్‌తో 6వ స్థానంలో ఉన్నాడు. రోహిత్ శర్మ(12,531)తో 10వ స్థానంలో నిలిచాడు.

### నా రికార్డును వైభవ్ బద్దలు కొడతాడు : బట్లర్

టీ20 క్రికెట్‌లో అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పిన తర్వాత బట్లర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన రికార్డును బద్దలు కొట్టే అవకాశముందని అంచనా వేశాడు. 'టీ20ల్లో అత్యధిక పరుగులు చేసినందుకు సంతోషంగా ఉంది. కానీ ఏదో ఒక్క రోజు ఈ రికార్డును వేరొకరు అధిగమిస్తారు. బహుశా ఆ ప్లేయర్ వైభవ్ సూర్యవంశీ కావొచ్చు. కానీ, ఇది చాలా గర్వపడే క్షణం'అని బట్లర్ తెలిపాడు.

## బరువు పెరుగుతున్న భారత క్రికెటర్లు

2027 వన్డే వరల్డ్ కప్ దగ్గర పడుతున్న నేపథ్యంలో భారత క్రికెటర్లు గాయాల బారిన పడుతున్నారు. ఇంగ్లాండ్ తో వన్డే సిరీస్ జరిగిన సందర్భంగానే హర్షిత్ రాణా గాయపడగా, లేటెస్ట్ గా బుమ్రాకు ఇంజూరీ అయింది. అయితే ఈ నేపథ్యంలో ప్లేయర్ల గాయాల విషయంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వ్యవహారంపై తీవ్రస్థాయిలో మాజీ క్రికెటర్లు విమర్శలు చేస్తున్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కు వెళ్లిన క్రికెటర్లు అధికంగా బరువు పెరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. హర్షిత్ రాణా కూడా ఈ సెంటర్ కు వెళ్లిన తర్వాత దాదాపు నాలుగు నుంచి ఐదు కిలోలు బరువు పెరిగాడట. అంటే 97 కేజీలతో బయటకు వచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయి.
ఒక్కసారిగా బరువు పెరిగిన నేపథ్యంలో హర్షిత్ రాణా మళ్లీ గాయం బారిన పడ్డట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అలర్ట్ అయింది బీసీసీఐ. బరువు పెరగడంపై వివరణ ఇవ్వాలని ఇప్పటికే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్వహణ బృందానికి బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వార్నింగ్ ఇచ్చినట్లు జాతీయ మీడియాలో కూడా కథనాలు వస్తున్నాయి. ప్లేయర్ల ఫిట్నెస్ ప్రమాణాలు దారుణంగా పడిపోవడం వెనుక గల కారణాలు తమకు చెప్పాల్సిందేనని, లేకపోతే సీరియస్ యాక్షన్ ఉంటుందని ఆయన హెచ్చరించారట. అలాగే యోయో టెస్ట్ స్థానంలో తీసుకువచ్చిన బ్రాంకో టెస్ట్ పైన కూడా బీసీసీఐ అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో ఈ టెస్ట్ ను కూడా తొలగించి మళ్లీ యోయో టెస్ట్ పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనిపై శ్రీలంకతో జరిగే టెస్ట్ సిరీస్ పూర్తయిన తర్వాత బీసీసీఐ పెద్దలు సమీక్ష నిర్వహించబోతున్నట్లు సమాచారం. ఆ సందర్భంగా అన్ని అంశాలపై చర్చ చేయబోతున్నారట. 2027 వన్డే వరల్డ్ కప్ గెలిచే లక్ష్యంగా సంచలన నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు కూడా చెబుతున్నారు.

## ఫుట్‌బాల్ ఆడుతుండగా పిడుగు..

- ఒకరి మృతి, 12 మందికి తీవ్ర గాయాలు



**స్పోర్ట్స్ డెస్క్ :**
థాయిలాండ్‌లోని నరాధివాట్ (Narathiwat) ప్రావిన్స్‌లో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. అక్కడ నిర్వహించిన 'గోలక్ కప్' (Golak Cup) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భాగంగా శాంటిప్ హప్ స్టేడియం (Santip Hup Stadium) లో మ్యాచ్ అత్యంత ఉత్సాహంగా సాగుతున్న సమయంలో అకస్మాత్తుగా ఆకాశం మేఘావృతమై భారీ పిడుగుపడింది. ఆ పిడుగు నేరుగా గ్రౌండ్‌లో మైదానంలో ఆడుతున్న ఒక ఫుట్‌బాల్ ఆటగాడిపైనే పడటంతో సదరు క్రీడాకారుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ పిడుగు ధాటికి మైదానంలో ఉన్న మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే తోటి క్రీడాకారులు, మ్యాచ్ నిర్వాహకులు, ప్రేక్షకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. హుటాహుటిన రెస్క్యూ సిబ్బంది గాయపడిన వారందరినీ సమీపంలోని ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ప్రత్యక్షంగా మైదానంలో జరిగిన ఈ భయాందోళనకర దృశ్యాలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

## ఆసియా కప్ షెడ్యూల్.

- మరోసారి భారత్, పాక్ మ్యాచ్

**స్పోర్ట్స్ డెస్క్ :**
భారత్, పాకిస్తాన్ మహిళల జట్ల మధ్య మరోసారి మ్యాచ్ జరగనుంది. మహిళల ఆసియా కప్ 2026లో భాగంగా ఈ రెండు జట్లు తలపడనున్నాయి. కాసేపటికి క్రితమే అధికారికంగా ఈ టోర్నమెంట్ కు సంబంధించిన షెడ్యూల్ రిలీజ్ అయింది. దీని ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీన భారత్, పాకిస్తాన్ మధ్య హై వోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. దుబాయి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా రెండు జట్లు తలపడతాయి.

**ఆసియా కప్ 2026 షెడ్యూల్**
మహిళల ఆసియా కప్ 2026 ఆగస్టు 28వ తేదీన ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్ థాయిలాండ్, హాంకాంగ్ మధ్య జరుగుతుంది. ఈ టోర్నమెంట్ లో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. మరోసారి భారత్, పాకిస్తాన్ జట్లు ఒకే గ్రూపులో ఉండనున్నాయి. థాయిలాండ్, భారత్, పాకిస్తాన్, హాంకాంగ్, చైనా గ్రూప్ ఏలో ఉంటాయి. యూఏఈ, ఇండోనేషియా, బంగ్లాదేశ్, శ్రీలంక గ్రూప్‌బీలో ఉండనున్నాయి. ప్రతి గ్రూప్ లో టాప్2లో నిలిచిన జట్లు సెమీ ఫైనల్ కు చేరుతాయి. సెప్టెంబర్ 13వ తేదీన ఫైనల్ మ్యాచ్ ఉంటుంది. ఈ టోర్నమెంట్ కు సంబంధించిన మ్యాచ్ లు దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగానే జరగనున్నాయి.

## తొలి రోజు నుంచే ప్రతి సవాలుకు జవాబు ఇద్దాం

**స్పోర్ట్స్ డెస్క్:**
మొన్నటి వరకు వన్డేలు, టీ20లు ఆడిన భారత జట్టు ఇప్పుడు టెస్టు ఫార్మాట్‌లో తలపడేందుకు సిద్ధమైంది. ఇప్పటికే శ్రీలంకకు చేరుకొన్న టీమ్‌ఇండియా.. ఆ జట్టుతో (SL vs IND) రెండో టెస్టుల సిరీస్‌ను ఆడనుంది. ఆగస్టు 15 నుంచి గాలె వేదికగా మొదటి టెస్టు ప్రారంభం కానుంది. దానికంటే ముందు.. శుక్రవారం నుంచి మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా ఆటగాళ్లకు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ (Head Coach Gautam Gambhir) కీలక సూచనలను చేశాడు. ఆ వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. "మన ముందు ఏ లక్ష్యం ఉందో మనకు తెలుసు. ఎందుకోసం ఆడుతున్నామో తెలుసు. పరిమితులను అధిగమించగలం. ఏదైనా సాధించగలం. అన్ని విభాగాల్లోనూ సత్తా చూపించగలం. బ్యాటింగ్, బౌలింగ్ ఏదైనా సరే.. ఆగస్టు 15 ఉదయం నుంచి మనకు ఎదురయ్యే ప్రతి సవాలుకు జవాబు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలి. ఇప్పట్నుంచే అందుకోసం సన్నద్ధమవుదాం. ఇప్పుడు మనతోపాటు ఇద్దరు కొత్త ప్లేయర్లు ఉన్నారు. వారిద్దరికి శుభాకాంక్షలు చెబుతున్నా. సరాంశ్ ఇక్కడి వరకు వచ్చేందుకు చాలా కష్టపడ్డావు. ఎప్పుడు అవకాశం వచ్చినా దేశం, కుటుంబం గర్వపడేలా చేస్తావని ఆశిస్తున్నా. ఇక ఆకిబ్ నబీకి స్వాగతం.





గత సీజన్‌లో అదరగొట్టావు. జమ్మూకశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీని నెగ్గడంలో కీలక పాత్ర పోషించావు. ఇక, మనతోపాటు పనిచేసేందుకు శుభదీప్ ఘోష్ (ఫీల్డింగ్ కోచ్) వచ్చారు. చాలా జట్లతో గత కొన్నేళ్లుగా ఆయన వర్క్ చేశారు. ఆయన నిబద్ధత, ఎనర్జీ లెవల్స్ అద్భుతం. తన ప్రతిభతో మనందరిని లక్ష్యం దిశగా తీసుకెళ్తారని ఆశిస్తున్నా" అని గౌతమ్ గంభీర్ (Gautam Gambhir) వ్యాఖ్యానించాడు.

## తూ.. తూ.. తూ.. జడల్ జమానా..

# నాని రక్తాభిషేకానికి దిష్టితీయాలే...

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్యారడైజ్ సినిమా మీద భారీ అంచనాలైతే ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ సినిమాని తెరకెక్కిస్తున్నట్టుగా తెలుస్తుంది. గురువారం ఈ సినిమా నుంచి ఒక టీజర్ రిలీజ్ చేశారు. ఆ టీజర్ మొదటి నుంచి చివరి వరకు ఆద్యంతం ఆసక్తికరంగా ఉండటమే కాకుండా చాలా రా అండ్ రస్టిక్ సన్నివేశాలతో ఉంది. నాని పూర్తిగా మాస్ మూడ్ లోకి వెళ్ళిపోయినట్టుగా తెలుస్తుంది. ఇక ఈ టీజర్ ను బట్టి చూస్తుంటే ఈ సినిమాలో కథ కూడా చాలా స్ట్రెయిట్ ఫార్వర్డ్ గా చెప్పే ప్రయత్నం చేసినట్టుగా తెలుస్తుంది. ముఖ్యంగా ఈ సినిమాలోని కథ ఏంటి అంటే ఒక దొరకు వ్యతిరేకంగా కొంతమంది తిరుగుబాటు చేసి వాళ్లకు కావాల్సిన స్వేచ్ఛను వాళ్ళు ఎలా తెచ్చుకున్నారు వాళ్ల ఏరియాని వాళ్ళు ఎలా దక్కించుకున్నారు అనేది ఈ సినిమా కోర్ పాయింట్ గా తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో టీజర్ ని కనుక మనం పూర్తిగా అబ్జర్వ్ చేసినట్లయితే ఇందులో మెయిన్ విలన్ గా మోహన్ బాబు కనిపిస్తున్నాడు. అలాగే మాలిక్ అనే క్యారెక్టర్ లో తను ఒదిగిపోయినట్టుగా తెలుస్తుంది. తను యంగ్ గెటప్ లో ఉన్నప్పుడు కూడా లుక్స్ అయితే చాలా హైలెట్ గా ఉన్నాయి...



ఇక నాని ఊర మాస్ క్యారెక్టర్ లో మరోసారి మెప్పించడానికి రెడీ అవుతున్నాడు. విజువల్స్ అయితే టాప్ నాచ్ లో ఉన్నాయి. బోల్డ్ సన్నివేశాలు లేకపోయినా కూడా తో వైలెన్స్ తో కూడిన సన్నివేశాలకు పెద్దపీట వేస్తూ టీజర్ కట్ చేశారు. మొత్తానికైతే శ్రీకాంత్ ఓదెల ఆగస్టు 6 తేదీ 6 గంటలకు ఇండస్ట్రీ తగలడిపోతుందని ఎప్పుడైతే చెప్పాడో అప్పటినుంచి ఈ టీజర్ మీద అందరు భారీ ఆశాలైతే పెట్టుకున్నారు. దానికి తగ్గట్టుగానే పవర్ ప్యాక్డ్ గా టీజర్ ను దింపాడు. మొత్తానికైతే సినిమా రిలీజ్ డేట్ ను కూడా అనౌన్స్ చేశారు. సెప్టెంబర్ 24వ తేదీన ఈ సినిమా గ్రాండ్ గా థియేటర్లోకి రాబోతుంది... ఇక ఈ టీజర్ లో నాని చెప్పిన డైలాగులు సైతం చాలా పవర్ ఫుల్ గా ఉన్నాయి. నాని అరుస్తూ వాళ్ళ బతుకులు మీద ఉమ్మేస్తూ మనం ఇప్పటికైనా మారకపోతే మనం ఎందుకు అనే మోటివేషన్ ఇస్తూ తన వర్గం వాళ్ళకి చెప్పిన డైలాగులు సైతం ప్రేక్షకుడిలో ఒక ఇంపాక్ట్ ను క్రియేట్ చేసే విధంగానే ఉన్నాయి.

నాని ఈ నేల ఎవరిది.. ఈ దేశం ఎవరిది అంటూ చెప్పిన డైలాగులు కూడా బాగున్నాయి. ఫైనల్ గా నాని బ్లేడ్లను చేయికి కట్టుకొని రక్తాన్ని చిందిస్తూ దిష్టి తీసేటప్పుడు చెప్పిన డైలాగులు కూడా ఆద్యాంతం ప్రేక్షకుడిని ఆకట్టుకుంటున్నాయి. టీజర్ లో అన్ని పర్ఫెక్ట్ గా కుదిరినప్పటికీ నాని ఫాస్ట్ ఫాస్ట్ గా డైలాగులు చెప్పడమే ఎక్కడ తేడా కొట్టినట్టుగా అనిపిస్తుంది. ఆ డైలాగ్ డెలివరీ పెర్ఫెక్ట్ గా లేదేమో అనిపిస్తుంది.

మొత్తానికైతే సంవత్సరం క్రితం వచ్చిన గ్లింప్స్ ఇచ్చిన ఇంపాక్ట్ ఈ టీజర్ ఇవ్వలేదు అనే ఫీల్ కలుగుతుంది. కారణం ఏదైనా కూడా మూవీ మీద అంచనాలను కొంచెం తగ్గించడానికి ఈ టీజర్ ని కొంచెం తక్కువ చేసి చూపించారనే విషయం అర్థమవుతుంది. ఇక ట్రైలర్లో పూర్తి విశ్వరూపాన్ని చూపించడానికి శ్రీకాంత్ ఓదెల రెడీ అవుతున్నట్టుగా తెలుస్తుంది...



కొరియన్ కనకరాజు రివ్యూ

# కామెడీ కనకరాజు

వరుణ్ తేజ్ హీరోగా, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన తాజా మూవీ 'కొరియన్ కనకరాజు'. నిజానికి వరుణ్ తేజ్ సహా మేర్లపాక గాంధీ, ఈ సినిమా నిర్మించిన ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో పాటు యూవీ క్రియేషన్స్‌కి హిట్ చాలా అవసరం. ఈ క్రమంలోనే ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి అందరిలోనూ ఆసక్తి ఉంది. అయితే ఈ సినిమా కంటెంట్ రిలీజ్ చేసినప్పుడు ఏర్పడిన అంచనాల కంటే, ఈ మధ్యకాలంలో రిలీజ్ చేసిన ట్రైలర్‌తో పాటు వరుసగా హీరో, దర్శకుడు చేస్తున్న ప్రమోషన్స్‌తో సినిమా మీద ఆసక్తి అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. ఇక ఎట్టకేలకు ఈ సినిమాను స్పెషల్ ప్రీమియర్స్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. మరి సినిమా ఎలా ఉంది? ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంది అనేది ఇప్పుడు రివ్యూలో చూద్దాం.

**ఇదీ కథ..**

కనకరాజు (వరుణ్ తేజ్) అనంతపురం జిల్లా పెనుగొండలో ఒక చెక్కభజన బృందాన్ని నడిపిస్తూ ఉంటాడు. తన స్నేహితుడు కిష్టప్ప(సత్య)తో కలిసి సరదాగా లైఫ్ గడిపేస్తూ ఉంటాడు. ఒకరోజు అనుకోకుండా అదే ఊరికి చెందిన చైత్ర (రితిక నాయక్)ను చూసి మొదటి చూపులోనే ప్రేమలో పడతాడు. ఎప్పటికైనా కొరియా వెళ్లి సెటిల్ అవ్వాలని కలలు కంటూ ఉండే ఆమె, అందుకోసం కియా కార్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో కూడా పనిచేస్తూ ఉంటుంది. అయితే ఊహించని విధంగా కనకరాజులోకి ఒక కొరియన్ ఆత్మ ప్రవేశిస్తుంది. ఆ కొరియన్ ఆత్మ ప్రవేశించాక కనకరాజు లైఫ్ ఏమైంది? అతను ఎందుకు కొరియా వెళ్లాల్సి వచ్చింది? చివరికి ఆ ఆత్మ కనకరాజుని వదిలేసిందా లేదా? అనే విషయాలు తెలియాలంటే సినిమాని బిగ్ స్క్రీన్ మీద చూడాల్సిందే!

**విశ్లేషణ**

ఈ సినిమాని ముందు నుంచి ఇండోకొరియన్ హారర్ కామెడీ సినిమాగా ప్రమోట్ చేస్తూ వచ్చింది టీమ్. అయితే సినిమా ప్రారంభమైన కొద్దిసేపటి వరకు కథ అంతా ఆంధ్రప్రదేశ్‌లోని పెనుగొండ ప్రాంతంలోనే తిరుగుతూ ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే కనకరాజు శరీరంలోకి కొరియన్ వ్యక్తి ఆత్మ ప్రవేశించే వరకు సినిమా బోర్ ఫీలింగ్ కలిగిస్తుంది. కానీ ఒక్కసారి ఆత్మ ఎంటర్ అయ్యాక సినిమా వేగం పుంజుకుంది. కొరియన్ ఆత్మ కనకరాజు శరంలోకి ఎంటర్ అయ్యాక, అతని స్నేహితుడైన కిష్టప్ప (సత్య) పాత్రతో కామెడీ బాగా వర్కౌట్ అయింది. మామూలుగానే సత్య వన్‌లైనర్లకి, అతని ఎక్స్‌ప్రెషన్స్‌కి ప్రేక్షకులకు నవ్వు వస్తుంది. దానికి తోడు వరుణ్ తేజ్ టైమింగ్ కూడా తోడవడంతో ఫస్ట్ హాఫ్ బాగా వర్కౌట్ అయింది. ఇక కథ సెకండ్ హాఫ్‌లోకి వెళ్లాక కొంచెం రొటీన్ ఫార్మాట్‌లోకి వెళుతుందేమో అనే ఫీలింగ్ కలుగుతుంది. లాజిక్స్ ఎక్కడా పెద్దగా పట్టించుకోకుండా సినిమాటిక్ లిబర్టీ ఎక్కువగా తీసుకున్నట్లు అనిపించింది. అయితే సెకండ్ హాఫ్‌లో కూడా సత్య, వరుణ్ తేజ్ మధ్య వచ్చే కామెడీ ఎపిసోడ్లు సినిమా మొత్తానికే కీలకమైన ప్లస్ పాయింట్ అని చెప్పొచ్చు. మొత్తంగా చూసుకుంటే ముందు నుంచి హారర్ కామెడీ అంటూ ప్రమోట్ చేస్తూ వచ్చిన ఈ సినిమాలో హారర్ పెద్దగా భయపెట్టకపోయినా, కామెడీ మాత్రం బాగా వర్కౌట్ అయింది.

ఫస్ట్ హాఫ్ మొత్తం మీద కొన్ని ఎపిసోడ్లు బాగా కుదిరాయి. ముఖ్యంగా ఇంటర్వెల్ ట్విస్ట్ సెకండ్ హాఫ్ మీద ఆసక్తి పెంచింది. సెకండ్ హాఫ్ ప్రారంభమయ్యాక కథ కొరియాకి షిఫ్ట్ అవుతుంది. అక్కడికి వెళ్లాక కథ ఊహించిన విధంగానే సాగినా కూడా కొంతవరకు ఎంగేజింగ్‌గానే సాగుతుంది. అయితే సెకండ్ హాఫ్ కొన్ని చోట్ల సాగదీసిన ఫీలింగ్ కలిగిస్తుంది. అయినా సరే ఎక్కడా బోర్ ఫీలింగ్ కలగకుండా చూసుకోవడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడు. అయితే కొంచెం లాజికల్‌గా కూడా కథనం పరంగా రాసుకుని ఉంటే ఇంకా రిజల్ట్ బాగుండేది.

**ఆర్టిస్టుల పెర్ఫామెన్స్**

నటీనటుల విషయానికి వస్తే, ఆత్మ ప్రవేశించిన పల్లెటూరి కుర్రాడిగా కనకరాజు అనే పాత్రలో వరుణ్ తేజ్ జీవించాడు. అతని లుక్స్, మేకోవర్ బాగా కుదిరాయి. అటు యాక్షన్‌తో పాటు కామెడీ, డాన్సులు అన్నీ పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యాయి. ఇక ఈ సినిమాలో వరుణ్ తేజ్‌తో పాటు అంతే పేరు సత్యకి కూడా వస్తుంది. ఎందుకంటే సత్య కనిపించిన ప్రతిసారీ ప్రేక్షకులను నవ్వించే ప్రయత్నం చేశాడు. వన్‌లైనర్లు, సోషల్ మీడియాలో బాగా వైరల్ అయిన మీమ్ మెటీరియల్‌ను అవపోసన పట్టి అందరినీ ఆకట్టుకున్నాడు. రితిక నాయక్ ఉన్నంతలో పర్వాలేదనిపించేలా నటించింది. ఇక మురళీధర్ గౌడ్ కూడా తన రొటీన్ పాత్రలతో కాకుండా సరికొత్తగా కనిపించి ఆకట్టుకున్నాడు. బుల్లి రాజు, విటీవీ గణేష్ ట్రాక్ కూడా నవ్వించింది. వారిద్దరూ తమ పాత్రల పరిధి మేరకు నటించారు. ఇక మిగతా కొరియన్ నటీనటులు ఎక్కువగా యాక్షన్ సీక్వెన్స్‌లకే పరిమితమయ్యారు, అవి కూడా సరిగ్గా సెట్ అయ్యాయి.

**టెక్నికల్ ఎలిమెంట్స్**

ఇక టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే, ఈ సినిమా పాటలు ఎంత హిట్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆర్‌ఆర్ (బీజీఎం) కూడా అంతే కరెక్ట్‌గా సెట్ అయింది. తమన్ పూర్తిస్థాయిలో తన డ్యూటీ చేసినట్లు అనిపించింది. ఇక మేర్లపాక గాంధీ రచయితగా, దర్శకుడిగా మరోసారి తన ముద్ర వేసుకునే ప్రయత్నం చేశారు. అయితే లాజిక్స్ విషయంలో ఇంకాస్త కేర్ తీసుకుని ఉంటే బాగుండేది. సినిమాటోగ్రఫీ బాగుంది. గ్రాఫిక్స్ వర్క్ కూడా చాలా బాగా కుదిరింది. ఎడిటింగ్ క్రిస్పీగా ఉంది, నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి.

**మొత్తగా చూస్తే..**

ఓవరాల్‌గా 'కొరియన్ కనకరాజు' అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ విత్ సమ్ హారర్ ఎలిమెంట్స్.

# సూపర్ స్టార్ సినిమాలో శ్రీలీల

సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం కమల్ హాసన్ నిర్మిస్తోన్న ఓ భారీ ప్రాజెక్టులో నటిస్తున్న సంగతి తెలిసిందే. దీని తర్వాత మరో ప్రాజెక్టు కూడా లైన్‌లో పెట్టాడట సూపర్ స్టార్. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్కింగ్ దశలో ఉన్న ఈ మూవీలో శ్రీలీలను ప్రధాన పాత్రలో ఫిక్స్ చేశారట మేకర్స్. అయితే.. సినిమా ఏంటీ, డైరెక్టర్ ఎవరు అనేది తెలియనప్పటికీ శ్రీలీలను బోర్డులోకి తీసుకున్నట్లు కోలీవుడ్ వర్గాల నుంచి టాక్ వినిపిస్తుంది. అలాగే ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో రాబోతున్నాయని వార్తలు వస్తుండగా.. సూపర్ స్టార్ రజినీకాంత్ సినిమాలో శ్రీలీల చాన్స్ అందుకుందని తెలుసుకున్న ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రధానికి మద్దతు ఇవ్వడం నా డ్యూటీ..

## సౌత్ స్టార్ మాధవన్



సోషల్ మీడియాలో తనను చాలా మంది 'సంఘ్ (ఆర్ఎస్ఎస్)' వ్యక్తి అని పిలవడంపై నటుడు మాధవన్ స్పందించారు. తాను అలాంటి కామెంట్స్ పట్టించుకోనని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన దేశ నాయకులకు మద్దతు ఇవ్వడం తన కనీస బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ ఇంటర్వ్యూలో దీని గురించి మాధవన్ మాట్లాడారు. "నేను ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా పోస్ట్ లు పెట్టలేదు. అలాగే మంచి పనులు ఏ నాయకుడు చేసినా ప్రశంసిస్తాను. ముఖ్యమంత్రి, ప్రధాని.. ప్రజల నాయకులు. వాళ్లు మంచి పనులు చేస్తే మద్దతుగా నిలవడం పౌరుడిగా నా ధర్మం. సోషల్ మీడియాలో నేను పెట్టే పోస్ట్ లకు వచ్చే కామెంట్లు చదువుతాను. కానీ, అవి నా ఆలోచనలను, నిర్ణయాలను ప్రభావితం చేయలేవు" అని నటుడు చెప్పారు.

ఇక 'ధురంధర్' ఓ ప్రచార చిత్రమంటూ వచ్చిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. "ఈ సినిమాను అలా ఎందుకు అంటున్నారో తెలియడం లేదు. దీని కథ పాకిస్థాన్ నేపథ్యంలో సాగుతూ, భారత జాతీయ భద్రతకు సంబంధించిన సంఘటనల చుట్టూ తిరుగుతుంది. ఇది కేవలం నేషనల్ సెక్యూరిటీ డ్రామా మాత్రమే. తెరపై పాత్రలను నిజాయతీగా చూపించడమే మా బాధ్యత. విమర్శలకు భయపడి నిజాలను మార్చడం నిజాయతీ అనిపించుకోదు. మన దేశ విజయాలను, భారత గొప్పతనాన్ని సినిమాల రూపంలో ప్రపంచానికి చెప్పాలనుకుంటున్నాను. ఇందులో ఎలాంటి తప్పూ లేదు. దాన్ని నేరంగా చూపిస్తూ.. ప్రచారం అనడం సరికాదు" అని మాధవన్ పేర్కొన్నారు.





## మరోసారి హద్దులు దాటేసిన

# విష్ణు ప్రియ..

తెలుగు బుల్లితెర నటి, వ్యాఖ్యాత విష్ణుప్రియ తాజా ఫొటోషూట్‌తో మరోసారి సామాజిక మాధ్యమాల్లో ఆకర్షణగా నిలిచారు. స్టైలిష్ డిజైనర్ దుస్తుల్లో ఆమె చేసిన ఫొటోషూట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రత్యేక డిజైన్‌తో రూపొందించిన నలుపు రంగు దుస్తులు, సింపుల్ హెయిర్ స్టైల్, మినిమల్ మేకప్‌తో విష్ణుప్రియ హుందాతనంతో పాటు ఆధునిక ఫ్యాషన్‌ను ప్రతిబింబించారు. ఆత్మవిశ్వాసంతో ఇచ్చిన పోజులు ఫొటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తాజా చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న వెంటనే అభిమానులు, నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. ఆమె స్టైల్, ఫ్యాషన్ సెన్స్‌పై ప్రశంసలు కురిపిస్తూ ఫొటోలను విస్తృతంగా పంచుకుంటున్నారు. గ్లామర్‌తో పాటు ఫ్యాషన్‌కు ప్రాధాన్యం ఇస్తూ విష్ణుప్రియ తరచూ కొత్త ఫొటోషూట్‌లతో అభిమానులను అలరిస్తున్నారు. తాజా ఫొటోలు కూడా అదే తరహాలో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# శ్రీముఖి అందాలు చూడతరమా?

తెలుగు బుల్లితెర యాంకర్ శ్రీముఖి మరోసారి తన స్టైలిష్ ఫొటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. తెల్లటి షర్ట్, డిజైనర్ స్కర్ట్, సంప్రదాయ ఆభరణాల కలయికతో ఆమె చేసిన తాజా ఫొటోషూట్‌కు సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. సింపుల్ మేకప్, ఆకర్షణీయమైన హెయిర్‌స్టైల్‌తో హుందాతనాన్ని ప్రతిబింబించిన శ్రీముఖి, ప్రతి ఫొటోలో ఆత్మవిశ్వాసంతో కూడిన హావభావాలను ప్రదర్శించింది. మోడ్రన్, ట్రెడిషనల్ శైలుల సమ్మేళనంగా ఆమె లుక్‌ను అభిమానులు ప్రశంసిస్తున్నారు. ఈ ఫొటోషూట్‌లో ధరించిన ఆభరణాలు, వస్త్రధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్లామర్‌తో పాటు సొగసును సమతూకంగా ఆవిష్కరించిన శ్రీముఖి ఫ్యాషన్ సెన్స్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజా ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతుండగా, అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తూ ఆమె లుక్‌ను అభినందిస్తున్నారు.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644